J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 15.05.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 50 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

# కరోనా వాతకు.. ప్యాకేజీ పూత

- దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టే పనిలో కేంద్రం
- అనేక రంగాలకు 20 లక్షల కోట్ల భారీ ప్యాకేజీ
- చిన్న పరిశ్రమలకు పెద్ద ఆసరా
- స్వదేశీ ఉత్పత్తులకు పెద్దపీట
- కొన్ని రంగాల వారికే దక్కిన ఊరడింపు
- పలు రంగాలలో ప్యాకేజీపై అసంతృప్తి



*అసాధారణ పరిస్థితులు ఏర్పడినప్పుడు అసాధారణ నిర్ణయాలే తీసుకోవాలన్నది పెద్దల మాట. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా అక్షరాలా అదే పాటిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి వ్యాధి మానవాళిని అల్లకల్లోలం చేస్తున్న వేళ, అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదేలవుతున్న తరుణంలో, భారత్‌లో ఆ వ్యాధి నియంత్రణకు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటూనే, అటు ప్రజల జీవితాలకు, ఇటు జీవనోపాధికి ఇబ్బందులు లేకుండా దేశచరిత్రలోనే గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలను అన్ని విధాలా ఆదుకునేందుకు 20 లక్షల కోట్ల రూపాయలతో భారీ ప్యాకేజీని ప్రకటించడం ప్రజలకు ఎంతో ఊరట కలిగిస్తోంది. అయితే కొన్ని రంగాలవారికే ఈ ఊరడింపు లభిస్తుందనే విమర్శలు కూడా అక్కడక్కడా వ్యక్తమవుతున్నాయి!*

కరోనా మహమ్మారి వ్యాధి ప్రపంచమంతా వ్యాపిస్తూ లక్షలాదిమందిని పొట్టనపెట్టుకుంటూ అందరినీ అత్యంత భయోత్పాతానికి గురి చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఈ వ్యాధికి సుమారు మూడు లక్షల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోవడమే కాక ఇంకా దాదాపు 45లక్షల మంది దాకా ఈ వ్యాధితో, అనుక్షణం ప్రాణభయంతో విలవిలలాడుతుండడం మానవాళికే అంతులేని విషాదం. ఈ వ్యాధి ప్రభావంతో ప్రపంచంలోని ఆర్థికవ్యవస్థలన్నీ కుప్పకూలిపోతున్నాయి. ఒకవైపు జీవితం..మరోవైపు జీవనం..ఎప్పుడు ఏమవుతాయో తెలియని పరిస్థితి. ఇంతటి కల్లోలం ప్రపంచ చరిత్రలోనే ఎప్పుడూ లేదు. ఇలాంటి దుస్థితిలో భారత్ ఎంతో నిబ్బరంగా ఉంటూ, ఆత్మస్థైర్యంతో కరోనా నియంత్రణకు చర్యలు తీసుకుంటూ, ఆ వ్యాధికి దూరంగా ఉండేందుకు లాక్‌డౌన్‌ను పాటిస్తూ ముందుకు సాగుతోంది. ఇప్పటికే

(మిగతా 11వ పేజీలో)

## ఏపి, తెలంగాణల మధ్య..

# జల జగడం




- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంపు, రాయలసీమ ఎత్తిపోతల కరువు నివారణ పథకానికి శ్రీకారం
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న కేసీఆర్
- రాష్ట్ర ప్రయోజనాల కోసం లెక్క చేయని జగన్

*దేశంలో 28 రాష్ట్రాలున్నాయి. రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదాలు లేవు, ఉన్నదల్లా జల వివాదాలే! దేశంలోని ప్రతి జీవనది కూడా ఆయా రాష్ట్రాలను కలుపుతూ ప్రవహిస్తుంటుంది. ఆ రాష్ట్రాలన్నీ కూడా ఆ నదీ జలాలను వాడుకుంటూనే వుంటాయి. అయితే ఈ నదీ జలాల పంపకంలో తేడాల దగ్గరే ఆయా రాష్ట్రాల మధ్య వివాదాలు చెలరేగుతుంటాయి. ఆయా రాష్ట్రాల ప్రజలు బాహాబాహీకి దిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. కావేరి నదీ జలాల విషయంలో కర్నాటక, తమిళనాడుల మధ్య తరచూ ఇలాంటి గొడవలే జరుగుతుంటాయి.*

(మిగతా 11వ పేజీలో)

## నెల్లూరుకు

# మోక్షమెప్పుడో?




- సెంచరీ దాటిన కేసులు
- జోన్ల విధానంతో గందరగోళం
- కేసులు డిశ్చార్జ్ అయినా నిర్బంధంలోనే కొన్ని ప్రాంతాలు

*నెల్లూరు నగర ప్రజలు లాక్‌డౌన్ నేపథ్యంలో తీవ్ర గందరగోళ పరిస్థితుల్లో వున్నారు. తాము ఏ జోన్‌లో ఉన్నామో కూడా వారికి అర్థం కావడం లేదు. కరోనా వైరస్ పాజిటివ్ వున్న ప్రాంతాలను రెడ్‌జోన్, ఆ ప్రాంత పరిధి నుండి కొంతమేర కంటోన్మెంట్ జోన్‌లో పెడతారు. పాజిటివ్ కేసులు నెగటివ్‌గా తేలాక ఆరెంజ్ జోన్‌లోకి వస్తాయి. అసలు పాజిటివ్ కేసులే లేకుంటే గ్రీన్‌జోన్‌గా వుంటుంది.*

నెల్లూరులో రెడ్‌జోన్ ఏదో, కంటోన్మెంట్ జోన్ ఎక్కడిదాకా ఉందోకూడా కొన్ని ప్రాంతాలవారికి తెలియడం లేదు. నగరంలో కొత్తూరు నుండి జనార్ధన్‌రెడ్డి కాలనీ దాకా కరోనా పాజిటివ్ కేసులున్నాయి. ఇటీవల స్టోన్‌హౌస్‌పేటలో కూడా కేసులు బయటపడ్డాయి. దీంతో స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట, లక్ష్మీపురం, తడికలబజారు సెంటర్ వంటి ప్రాంతాలు కూడా రెడ్‌జోన్‌లోకి వచ్చాయి.

(మిగతా 11వ పేజీలో)

# ఏకాంతంగానే అమ్మవారి బ్రహ్మోత్సవాలు

## - జొన్నవాడ కామాక్షితాయి ఆలయ నిర్వాహకుల వెల్లడి



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని మల్లికార్జున సమేత శ్రీ కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో ఈనెల13 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమ య్యాయి. కరోనా, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో ఈసారి అమ్మవారి బ్రహ్మోత్సవాలను భక్తులెవరూ లేకుండా ఏకాంతం గానే నిర్వహిస్తున్నామని, కనుక ఈ ఉత్సవాలకు భక్తులు, ఉభయకర్తలు ఎవరూ రావద్దని ఆలయ ఛైర్మెన్ చీమల రమేష్‌బాబు, ఇ.ఓ ఏవి శ్రీనివాసులురెడ్డిలు విజ్ఞప్తి చేశారు. బ్రహ్మోత్సవాలకు ఈనెల 13న అంకురార్పణ జర్గ్గా, 14న తిరుచ్చి ఉత్సవం జరిగింది. 15న శేష వాహనం, 16న పురుషామృగ వాహనం, 17న సింహవాహనం, 18న హంస వాహనం, 19న రావణసేవ, 20న వెండి నందిసేవ, 21న వెండి రథోత్సవం, 22వ తేది ఉదయం కల్యాణోత్సవం అన్నీ ఏకాంతంగానే జరుగనున్నాయి.

# నరసింహునికి.. శాస్త్రోక్తంగా చక్రస్నానం



జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో జరుగుతున్న శ్రీలక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 8న శ్రీవారికి చక్రస్నానం వేడుకగా జరిగింది. తొలుత స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు, సుదర్శన చక్రానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. చందనాలంకారంతో స్వామి అమ్మవార్లను అలంకరించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహ వచనంతో పాటు పసుపు కుంకుమ, చందనం, సుగంధద్రవ్యాలతో నవకలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7గంటలకు స్వామివారికి అశ్వవాహన సేవ నిర్వహించి, 9గంటలకు ధ్వజావరోహణం చేశారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఈ కార్యక్రమాలన్నీ అర్చకులు ఏకాంతంగా నిర్వహించారు.

**ముగిసిన బ్రహ్మోత్సవాలు :**

పెంచలకోనలో ఈనెల 3న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఈనెల 9వ తేదితో ముగిశాయి. ఆలయం ఆవరణంలో స్వామివారికి ఏకాంత పూజలు ముగిసిన తర్వాత ఉత్సవమూర్తులను ఈసారి పల్లకీకి బదులుగా ఎద్దుల బండిపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. పెంచలకోన నుంచి ఎద్దుల బండిపైనే స్వామివార్లను వేంచేపు చేసి గోనుపల్లి ఆలయానికి తరలించారు. ఈ సందర్భంగా పెంచలకోన ముఖద్వారం వద్ద పెనుశిల లక్ష్మీనృసింహ స్వామికి, ఆదిలక్ష్మి-చెంచులక్ష్మీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటసుబ్బయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆఖరి అస్త్రం



- చిన్ని నారాయణరావు
9440202942

ఇక పోరాటం సాగించాల్సిందే
సమయం ఆసన్నమవుతున్నది
మనిషి లేని నీడలా వచ్చి
చీకటిని కళ్లాపిగా చల్లి
చిక్కని చీకటిని ఆరబోసింది
ఏ దిక్కు నుంచి వచ్చిందో
శత్రుదుర్భేధ్యమైన పుడమిపైకి
గాలికెరటమై వచ్చింది
సమస్త జీవరాశుల్ని వదలి
మనుషుల్లో మాత్రమే మొలకలెత్తుతున్నది
ఆ సూక్ష్మ శత్రువుపై దండయాత్ర
సాగించాల్సిందే
చావుతప్పదని తెలిసీ
బ్రతుకుపోరాటం చేస్తున్న
మనుషులం మనం
ఈ తాటాకు చప్పుళ్ళకు భయపడతామా
ఏంటి?
చీకటిరాత్రికి ధాత్రి వెలుగుభాష
అర్థంకాదా ఏం?
దాడి చేయక తప్పదిక
గరిబోళ్ళకు సవాలుగా
విస్తట్లో సూర్యుణ్ణి ఉదయించకుండా
అధికార దురంధరుల
అంతర్థానాన్ని పర్యవేక్షిస్తూ
అసమాన ప్రతిభాపాటవాల్ని
నిలువునా కాలరాస్తూ
అప్రతిహతంగా సాగుతున్నది.
ఇక్కడంతా మృత్యుత్వమే
మరణించిన స్నేహతత్వమే
సమయానికి ఆఖరు ఘడియలు
మాత్రమే మిగిలాయి
విశ్రాంతికి విరమణకు వీలస్సలు లేదు
హరోంహర హరోంహర మంటూ
మానవులంతా ఒక్కటై
మనలోకి మనం తొంగిచూసుకొని
అంతర్ముఖులం కావడమే యుద్ధం
నిష్క్రియాపరత్వమే ఇప్పటి యుద్ధం
మన ఇల్లే మనకు నిజమైన యుద్ధభూమి
ఇల్లు కదలక పోవడమే పోరాటం
విజయానికిదే మనకు మిగిలిన ఆఖరి అస్త్రం!
విలయాన్ని ఆపగలిగే బ్రహ్మాస్త్రం!!

### దాతల ఔదార్యంతో..

## మునిసిపల్ కార్మికులకు యూనిఫాంలు

ఆత్మకూరులోని మునిసిపల్ కార్మికులకు దాతలు నలిశెట్టి శ్రీనివాసులుతో పాటు సుబ్బారావు, వి.నారాయణ రెడ్డి, చైతన్య భాస్కర్‌రెడ్డి తదితరులు రెండు జతల యూనిఫాంలు అందజేశారు. ఈనెల 10న ఆత్మకూరు పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఈ సాయం అందించారు. వైయస్సార్సీపి నాయకుడు డాక్టర్ కెవి శ్రావణ్ కుమార్ దాతృత్వంతో వారికి శానిటైజర్లు, సోప్‌లు, షాంపులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లారెడ్డి ఆనందరెడ్డి, ఎన్.ప్రతాప్‌రెడ్డి, సూరా భాస్కర్‌రెడ్డి, కామాక్షయ్యనాయుడు, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, ఎన్ఐ సంతోష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తలసేమియా వ్యాధి పట్ల

## తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

తలసేమియా వ్యాధి విషయంలో తల్లిదండ్రులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఈ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఈనెల 8న ఒక ప్రకటనలో కోరారు. తలసేమియా వ్యాధి లక్షణాలున్న బిడ్డలు జన్మించినప్పటి నుంచి రక్తం ఉత్పత్తి కాక ఆ బిడ్డల రక్తకణాలు మృతిచెందుతాయని, దీనివల్ల బిడ్డల్లో ఎదుగుదల లేకపోవడం, ముఖం, ఎముకలు అడ్డంగా ఎదగి వాపు రావడం, కాలేయవ్యాధులు, కామెర్లు, బరువు పెరగక పోవడం వంటి సమస్యలు వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి చిన్నారులకు నెలకు రెండుసార్లు రక్తం ఎక్కించాల్సి ఉందని, రెడ్‌క్రాస్‌లోను, నారాయణ ఆసుపత్రి రక్తనిధుల్లో వీరికి ఉచితంగా రక్తం ఎక్కిస్తారని పేర్కొన్నారు. తలసేమియా వ్యాధి బాధితులకు ప్రభుత్వం తనవంతు సహాయంగా నెలకు 10 వేల రూపాయలు అందజేస్తోందని పేర్కొన్నారు.

## కావలి రైస్‌మిల్లర్ల విరాళం 5 లక్షలు

కరోనా బాధితుల సహాయార్థం కావలి రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ వారు 5 లక్షల రూపాయల విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని ఈనెల 10న కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి అందజేశారు. కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ఆ మొత్తాన్ని వినియోగించాలని సంఘం ప్రతినిధులు కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు, గుడ్లు, అరటిపండ్లు వగైరాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైస్‌మిల్లర్ల అసోసియేషన్ నాయకులు ఈతముక్కల బాలమురళిరెడ్డి, యాసిన్, మేడా రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాయిదర్బార్ యువ సేవాదళ్ రక్తదానం




లాక్‌డౌన్ సమయంలో బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు తగ్గుతున్న కారణంగా మానవతా దృక్పథంతో నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతి నగర్‌లో వున్న శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరం సేవాదళ్ సభ్యులు 20 మంది ఈనెల 9న నోవా బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో గర్భిణీస్త్రీలకు, గుండెవ్యాధుల బాధితులకు రక్తం ఎంతో అవసరముంది. శ్రీ సాయినాథుడు సూచించిన మానవసేవలో భాగంగా శ్రీ సాయిదర్బార్ యువసేవాదళ్ సభ్యులు, సాయిభక్తులు నోవా బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన నోవా బ్లడ్ బ్యాంక్ అడ్మిన్ మోపూరు భాస్కర నాయుడు, బావిశెట్టి కిశోర్‌లకు సేవాదళ్ సభ్యులు బాబీ సాయి, వారి మిత్రబృందం కృతజ్ఞతలు తెలిపారు.

# అనధికార నీటి విడుదలపై ఎస్ఈ విచారణ

ఈనెల 11వ తేదీ తెల్లవారుజామున అనధికారికంగా సోమశిల జలాశయం 11 క్రస్ట్ గేట్ నుంచి నీటిని విడుదల చేయడంపై ఎస్ఈ రవీంద్రరెడ్డి ఈనెల 12న పరిశీలించారు. నీరు విడుదల చేయడంతో ఉప్పలపాడు వద్ద జాతీయ రహదారి డైవర్షన్ రోడ్డు కోతకు గురైంది. ఈ విషయం పత్రికల్లో రావడంతో ఎస్ఈ స్పందించి రికార్డులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించి అత్యవసరంగా నీరు ఎందుకు వదిలారు, అందుకు బాధ్యులెవరు?.. అనే అంశంపై విచారించారు. డీఈలు సుబ్రహ్మణ్యం, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

# మద్యం షాపులు తెరవొద్దు - పరసా రత్నం

లాక్‌డౌన్ సమయంలో మద్యం షాపులు తెరవొద్దంటూ మాజీమంత్రి పరసా రత్నం ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఈనెల8న ఆయన సూళ్ళూరుపేట తహశీల్దార్ హమీద్‌కు వినతపత్రం అందజేశారు. ప్రభుత్వం వ్యాపారదృక్పథంతో మద్యం షాపులకు అనుమతివ్వడం మంచిపద్ధతి కాదని, మద్యం షాపులు తెరవడంతో సామాజిక దూరం పాటించకపోవడం వల్ల కరోనా విజృంభిస్తుందని, పేదల ఇళ్ళల్లో ఈ మద్యం వల్ల అనేక గొడవలు చెలరేగుతాయని ఆయన పేర్కొన్నారు.

## నెల్లూరీయుల సహృదయంతో

# గుబాళిస్తున్న సేవా పరిమళాలు

## కరోనా బాధితులకు విరివిగా విరాళాలు

దానగుణంలో తమకు తామే సాటి అనిపించుకుంటూ, ఆపద సమయంలో మేము సైతం అంటూ స్పందిస్తూనే వున్నారు మన నెల్లూరీయులు. ఎక్కడ అవసరమైతే అక్కడ ఆదుకుంటూ తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు.



## 10కోట్ల 50లక్షలు అందించిన జివికె

అంతర్జాతీయ స్థాయిలో నెల్లూరు కీర్తి ప్రతిష్ఠలను పెంచిన జివికె రెడ్డి తమ గ్రూప్‌లోని వివిధ విభాగాల ద్వారా కరోనా బాధితులకు ఇప్పటివరకు 10కోట్ల 50లక్షలు అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు.

**తెలంగాణకు రూ.5 కోట్ల విలువైన పిపిఇ కిట్లు**

జివికె బయోసైన్సెస్ 5కోట్ల రూపాయలు విలువ చేసే 1,27,551 యూనిట్ల పిపిఇ కిట్లకు సంబంధించిన కొనుగోలు పత్రం(పర్చేస్ ఆర్డర్) కాపీని సంస్థ తరఫున జివి సంజయ్‌రెడ్డి తెలంగాణ మంత్రి కెటిఆర్‌కి అందచేశారు.

**మహారాష్ట్రకు 5 కోట్లు ...**

దేశంలోనే అత్యధిక కరోనా కేసులతో విలవిలాడుతున్న మహారాష్ట్రకు అండగా జివికె ఎయిర్‌పోర్ట్ ఫౌండేషన్ నుండి రూ.5కోట్ల విరాళాన్ని బ్యాంకు ట్రాన్స్‌ఫర్ ద్వారా అందజేశారు


**రాజస్థాన్‌కి 50 లక్షలు**

జివికె ఫౌండేషన్ ద్వారా 50 లక్షల రూపాయల విరాళాన్ని రాజస్థాన్ ప్రభుత్వానికి కూడా బ్యాంకు ద్వారా బదిలీ చేశారు.



## ఏపిలో కరోనా ఫైట్‌కు ఏఎంఆర్ 'కోటి'తో చేయూత

ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు తమ ఇంటి పేరునే కేరాఫ్ అడ్రస్‌గా మార్చుకున్న స్వర్గీయ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి కుటుంబం ఈ కరోనా కాలంలోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తమవంతు సహకారమందించింది. ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ ఛైర్మన్ ఆల్తూరు మహేష్‌రెడ్డి ఇటీవల తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి కరోనా సహాయ చర్యల నిమిత్తం కోటి రూపాయల విరాళం చెక్కును అందజేశారు.



## డబ్బులు ఊరికే రాకున్నా... కోటి రూపాయల విరాళమిచ్చాడు

'డబ్బులు ఊరికేరావు' అంటూ టీవీలలో ప్రకటనల ద్వారా ప్రజలందరికీ సుపరిచితుడైన లలిత జ్యూయలరీ అధినేత, మన నెల్లూరీయుడు డాక్టర్ ఎం.కిరణ్ కుమార్ ఈ కరోనా కాలంలో తన సొంత రాష్ట్రం పట్ల మమకారం చూపాడు. 'డబ్బులు ఊరికే రావు' అని పదేపదే చెప్పే ఆయన తన సొంత నిధులు కోటి రూపాయల విరాళాన్ని కరోనా నివారణ చర్యల నిమిత్తం ఈ నెల 13వ తేదీన తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి అందజేశాడు. నెల్లూరీయులకున్న దానగుణాన్ని తాను కూడా చాటుకున్నాడు కిరణ్.

# రసాయన కర్మాగారంలో పెద్ద అగ్నిప్రమాదం





నెల్లూరు, మైపాడురోడ్డులోని పి.సి.నాయుడు నగర్‌లో వున్న బాలాజీ కెమికల్ ఫ్యాక్టరీలో ఈనెల 10వతేదీ రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. అక్కడవున్నది రసాయన పదార్థాలు కావడంతో ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దాదాపు 2 కిలోమీటర్ల దూరం వరకు మంటలు కనిపించాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక శాఖాధికారులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. మూడు ఫైరింజన్‌లతో కొన్ని గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఫ్యాక్టరీలోని సామాగ్రి అంతా కాలిపోగా 10లక్షల రూపాయలకు పైనే నష్టం వాటిల్లింది. ప్రమాదం గురించి తెలియగానే ఇస్కాన్‌సిటీలోని తన క్యాంప్ కార్యాలయంలో వున్న మంత్రి అనిల్ కుమార్‌యాదవ్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. మంటలను అదుపులోకి తెచ్చేదాకా స్వయంగా పర్యవేక్షించాడు. తర్వాత జనసేన, బీజేపీ నాయకులు కూడా ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

**తరలించకుంటే ప్రమాదమే!**

మైపాడురోడ్డు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. బోడిగాడితోట ప్రాంతంలో రోడ్డు అధ్వాన్నంగా వుంది. రోడ్డు మార్జిన్‌లోనే ఆక్రమణలున్నాయి. ఇక్కడే పశువుల ఎముకలు నిల్వచేసే కేంద్రాలు, రసాయన ఫ్యాక్టరీలు వుంటున్నాయి. ఈ ప్రాంతమంతా కూడా నివాసాలు విస్తరించాయి. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతమైతే ప్రజలకు కూడా ఇబ్బందులే!

# 'మడ' నరికితే.. ప్రకృతి మెడ విరిచినట్లే



\- సోమిరెడ్డి

కాకినాడ సముద్ర తీరంలో వైసిపి కాంట్రాక్టర్ల చేత మడ అడవులను నరికించడం క్షమించరాని నేరమని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డాడు. హైదరాబాద్ నుండి ఆయన పంపిన ప్రకటనలో మడ చెట్లు సముద్రతీరంలో వేలాది జీవులకు ఆవాసంగా ఉపయోగపడతాయని, రొయ్యలు, చేపపిల్లల ఉత్పత్తిలోనూ కీలకపాత్ర పోషిస్తాయని, సముద్ర చేపల రారాజుగా పిలుచుకునే పండు చేపకు పుట్టినిల్లు కూడా మడ చెట్లేనని ఆయన పేర్కొన్నాడు. మత్స్యకారులకు జీవనోపాధిని కల్పించడంతో పాటు తుఫాన్‌లు, బలమైన గాలులు వీచిన సమయంలో మడ అడవులు రక్షణగా నిలిచి తీరప్రాంతం కోతను అడ్డుకుంటాయని తెలిపాడు. సముద్రపు బ్యాక్‌వాటర్‌లో ఉప్పుశాతాన్ని తగ్గించి, వీటి కారణంగా పంటలు నాశనం కాకుండా కాపాడేది కూడా మడ అడవులేనన్నాడు. ఎవరైనా మడచెట్లను నరుకుతుంటే చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వమే, కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ఆ అడవులనే లేకుండా చేయాలనుకోవడం పెద్ద దుర్మార్గపు చర్యగా సోమిరెడ్డి అభివర్ణించాడు.

## 'ప్రభా'తం

ఆధునిక సమాజంలో పారిశ్రామికీకరణ ఒక భాగంగా మారిపోయింది. ప్రపంచ దేశాలన్నీ కూడా పారిశ్రామిక రంగంలో పోటీ పడుతున్నాయి. ఆధునిక మానవ జీవనశైలి పారిశ్రామిక రంగం చుట్టూనే తిరుగుతోంది. ఆయా దేశాల ప్రగతికి పారిశ్రామిక రంగమే పట్టుకొమ్మ అయ్యింది. పెట్టుబడులకు ఈ రంగమే మూలాధారం అయింది. కాబట్టి పరిశ్రమలు లేని ప్రగతిని ఊహించలేని పరిస్థితులు వచ్చాయి. అన్ని దేశాలు కూడా ఆయా దేశాల నుండి పెట్టుబడులను స్వాగతించేది పరిశ్రమల ద్వారానే! పరిశ్రమలు లేకుండా ఏ దేశ ప్రగతి సాధ్యం కాదు. పారిశ్రామిక ప్రగతి లేని సమాజాన్ని ఇప్పుడు మనం చూడలేము. అయితే సమాజంలో ఏ అభివృద్ధి జరిగినా అది మానవ వికాసానికి తోడ్పడాలి కాని వినాశనానికి కాదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమంతా మనిషి ఉన్నతంగా బతకడానికి ఉపయోగించుకోవాలి గాని మనిషి పతనానికి కాదు!

అయితే ఇప్పుడు దురదృష్టం ఏంటంటే అభివృద్ధి చెందిన ప్రతి సాంకేతిక పరిజ్ఞానం కూడా మంచికంటే చెడుకే ఎక్కువగా ఉపయోగపడుతోంది. దేశంలో పరిశ్రమలు అనేవి అవసరం, వాటి ద్వారా పదిమందికి ఉపాధి అవకాశాలు లభించడం అవసరం, అలాగే వస్తు ఉత్పత్తి అవసరం... ఇదంతా కూడా మనిషి బ్రతకడానికి. అయితే ఆ పరిశ్రమలే మనిషి బ్రతుకును చిదిమేస్తుంటే.. మానవ జీవితాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తుంటే... వారి ప్రాణాలను గాల్లో దీపాలుగా చేస్తుంటే... ఇలాంటి పారిశ్రామిక ప్రగతి పట్ల కూడా అప్పుడప్పుడు వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగానికి పెట్టని కోటగా భాసిల్లుతున్న విశాఖపట్నంలో ఎల్‌జి పాలిమర్స్ పరిశ్రమలో స్టైరిన్ విషవాయువు లీకై 12మంది ప్రాణాలు కోల్పోవడం, వందల మంది క్షతగాత్రులు కావడం దిగ్భ్రాంతి కలిగించే విషయమే! ఈ సంఘటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి స్పందించిన తీరు, బాధితులను ఆర్థికంగా ఆదుకున్న విధానం ప్రశంసలు అందుకుంది. సంఘటన జరిగిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించడం, ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రితో చర్చించడం, సహాయక చర్యలను ముమ్మరం చేయడం ఆహ్వానించదగ్గ పరిణామాలు. ప్రజలకు ఒక ప్రమాదం జరిగినట్లైతే... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత బాధ్యతగా వ్యవహరిస్తున్నాయనే దానికి ఈ సంఘటన ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కూడా చర్యలు తీసుకోవాలి. ముందు జాగ్రత్తతోనే ఇలాంటివి జరగకుండా చూసుకోగలం. భోపాల్ గ్యాస్ దుర్ఘటన మన కళ్ళముందు ఇంకా మెదులుతూనే ఉంది. దాదాపు పదివేల మంది ప్రాణాలు కోల్పోయిన అత్యంత విషాదకరమైన సంఘటన అది. దేశంలో మరో భోపాల్ సంఘటన తలెత్తకూడదు. కాబట్టి పరిశ్రమలను స్థాపించడంతో పాటు వాటి వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా చూడాలి. ఏదైనా ఒక పరిశ్రమ వద్ద ఒక పొరపాటు జరిగితే, దానిని మూసేయాలంటూ ఆందోళన చేస్తుండడం చూస్తున్నాం! అయితే ఇలాంటి సంఘటనలు జరుగుతాయని పరిశ్రమలను మూసుకుంటూ పోతే దేశంలో ఒక్క పరిశ్రమ కూడా మనుగడ సాగించలేదు.

పరిశ్రమల విషయంలో రెండు విభిన్నమైన అంశాలు ప్రతిసారీ తెరమీదకు వస్తున్నాయి. జనావాసాల మధ్య ప్రాణాంతక పరిశ్రమలను తొలగించాలంటూ ఆందోళనలు జరుగుతుంటాయి. ఇక్కడ మనం ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే ఈ పరిశ్రమలు నెలకొల్పే ఆ సమయంలో జనావాసాలకు దూరంగానే పెట్టుకుంటారు, ప్రమాదవశాత్తు ఇలాంటి గ్యాస్ లీక్ సంఘటనలు జరిగినప్పుడు ప్రజలకు ముప్పు రాకూడదనే వాటిని దూరంగా స్థాపించి ఉంటారు. కానీ కాలక్రమంలో నగరాలు, పట్టణాలు ఆ పరిశ్రమల మూలలకు విస్తరించి ఉంటాయి. ఆధునీకరణ ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోణంలో నిబంధనలకు విరుద్ధంగా అక్కడ భూములను సైతం లేఅవుట్లుగా మార్చి టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేసి ఉంటారు. ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకునేటప్పుడు ఫ్యాక్టరీలు, వాటినుండి వెలువడే విషవాయువులు పెద్ద లెక్క చెయ్యరు, కేవలం భూములను అధిక ధరలకు అమ్ముకోవడం అనే దృష్టితోనే ఇలాంటి పరిశ్రమల వద్ద కూడా అపార్ట్‌మెంట్‌లను, టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేస్తుంటారు. దేశంలో ఏ పారిశ్రామికవాడ చూసినా ఇప్పుడు నగరాలు పట్టణాలలో కలిసిపోయి ఉంటాయి. అంతెందుకు ఇప్పుడు ఎక్కడన్నా ఫ్యాక్టరీలను నెలకొల్పుతున్నారంటే ఆ చుట్టుపక్కల భూములను కొనేసి, లే అవుట్‌లుగా చేస్తున్నారు. మరి అలాంటప్పుడు ఎవరు తప్పు చేస్తున్నారు. ఎవరి వల్ల ప్రజలు బలి అవుతున్నారు అనేది కూడా మనం గుర్తించాలి. అసలు ప్రాణాంతక విషవాయువులు వెలువడే పరిశ్రమలకు సమీపంలో నివాసాలకు ప్రభుత్వాలు అనుమతినివ్వడమే పెద్ద తప్పు! విశాఖ సంఘటన ఇందుకు ఓ పెద్ద గుణపాఠం అనుకోవాలి. సుదీర్ఘ విరామం తర్వాత పరిశ్రమను పునఃప్రారంభించినపుడు అన్నీ సక్రమంగా ఉన్నాయా లేవా అని నిపుణుల చేత తనిఖీ చేయించుకుంటే ఇంత ప్రమాదం జరిగి ఉండేది కాదు. ఇకముందైనా ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పారిశ్రామిక వర్గాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి!

### విషపు కోణాలు



ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగానికి పెట్టని కోటగా భాసిల్లుతున్న విశాఖపట్నంలో ఎల్‌జి పాలిమర్స్ పరిశ్రమలో స్టైరిన్ విషవాయువు లీకై 12మంది ప్రాణాలు కోల్పోవడం, వందల మంది క్షతగాత్రులు కావడం దిగ్భ్రాంతి కలిగించే విషయమే! ఈ సంఘటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి స్పందించిన తీరు, బాధితులను ఆర్థికంగా ఆదుకున్న విధానం ప్రశంసలు అందుకుంది. సంఘటన జరిగిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించడం, ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రితో చర్చించడం, సహాయక చర్యలను ముమ్మరం చేయడం ఆహ్వానించదగ్గ పరిణామాలు.

## అగ్నిమాపకశాఖ అనుమతులు తప్పనిసరి

అగ్నిమాపకశాఖ నుంచి అనుమతులు లేని పరిశ్రమలు, రైస్‌మిల్లులు, విద్యాసంస్థల వారు తప్పనిసరిగా తమ శాఖ నుంచి 15 రోజుల్లో అనుమతి పొందాలని, లేదంటే తగు చర్యలు తీసుకుంటామని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. ఈనెల 13న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో 9 అత్యంత ప్రమాదకరమైన రసాయన పరిశ్రమలను గుర్తించామని, వీటిలో మూడింటికి ఎలాంటి అనుమతులు లేవని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా రసాయన పరిశ్రమలు, ఆక్వా, కోల్డ్‌స్టోరేజ్, రైస్‌మిల్లులపై ప్రత్యేక దృష్టి సారించామని, జిల్లాలో కేవలం ఒక్క ఇంజనీరింగ్ కళాశాలకు తప్ప మిగతా కళాశాలలకు అగ్నిమాపక శాఖ అనుమతులు లేవని చెప్పారు.



## వేదగిరి లక్ష్మీనృసింహునికి ఆస్థానోత్సవం

నెల్లూరు సమీపంలోని నరసింహకొండపై వెలసివున్న వేదగిరి లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 8న ఆలయ అర్చకులు వేడుకగా ఆస్థానోత్సవం నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామివారిని శోభాయమానంగా అలంకరించి శాస్త్రోక్తంగా తిరుమంజనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరోనా దృష్ట్యా లాక్‌డౌన్ కారణంగా స్వామివారి రథోత్సవాన్ని నిలిపివేసి ఏకాంతంగా పూజలు చేశారు. ఆలయ ఛైర్మెన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఇ.ఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.




## పరిష్కారానికి కృషి చేయాలి

చంద్రబాబునాయుడు 1998లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విశాఖ ఎల్.జి పాలిమర్స్ నుండి గ్యాస్ లీకై కొందరికి గాయాలయ్యాయి. అప్పుడు ఆ యూనిట్ తరలింపుపై జరిగిన ఆందోళనలను స్థానిక రాజకీయ నాయకులు గ్రామస్తులతో చర్చలు జరిపి సద్దుమణిగేలా చేశారు. 22 సంవత్సరాల తరువాత జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో మళ్ళీ లీకేజీ కారణంగా విషాదకరమైన సంఘటన సంభవించింది. ఇప్పుడు ఆ సంస్థ మీద కఠినచర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. సమస్య పరిష్కారం కావాలి గాని తప్పులు పట్టడం భావ్యం కాదు. ప్రభుత్వం పరిష్కార దిశగా ప్రణాళికలు రూపొందించాలి.

**రాళ్ళపల్లి రామసుబ్బారావు, నెల్లూరు.**

## మద్య నిషేధం ఇలాగేనా?

రాష్ట్రంలో దశలవారీగా మద్యపాన నిషేధం అమలు చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించి ఉన్నారు. అయితే ఆయన మద్యపాన నిషేధం కోసం తీసుకుంటున్న చర్యలు సమంజసమనిపించడం లేదు. మద్యపానాన్ని నిషేధించాలి అనుకుంటే ఆ పనిని ఒక జీవోతో పూర్తి చేయొచ్చు. 1994లో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చినప్పుడు ఒక జీవోతోనే మద్యపాన నిషేధం అమలు చేశారు. ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి ఆ మార్గాన్ని అనుసరించకుండా దశలవారీ మద్యపాన నిషేధం అంటూ నాసిరకమైన మద్యం అమ్మకాలతో తన వాగ్దానంపై చిత్తశుద్ధిని కోల్పోతున్నాడు. మద్యపాన నిషేధంపై చిత్తశుద్ధి ఉంటే కరోనా వైరస్ సీజన్లో ఇంత అర్జెంటుగా మద్యం అమ్మకాలు సాగించాల్సిన అవసరం ఏముంది.

**అనిశెట్టి సురేష్, నెల్లూరు.**

## ఒకే దేశం - ఒకే చట్టం

దేశంలో మతానికో చట్టాన్ని అమలు చేస్తున్నారు. ఏ దేశంలో లేని విధంగా ఇక్కడ మైనార్టీలను ప్రత్యేక హక్కుల పేరుతో నెత్తినెక్కించుకుంటున్నారు. కొన్ని వర్గాలవాళ్ళు ఈ దేశంకంటే మాకు మా మతమే గొప్పది అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దేశంలో హక్కులను, వనరులను అనుభవిస్తూ, బాధ్యతలను విస్మరిస్తున్నారు. దేశ ప్రయోజనాలకు భంగం వాటిల్లేలా వ్యవహరిస్తున్నారు. ప్రజలందరికీ ఒకే చట్టం అమలు చేయాలి. దేశం పట్ల బాధ్యతగా వ్యవహరించని వారిపై కఠినచర్యలు తీసుకోవాలి.

**సి.రాజీవి, నెల్లూరు.**

# ఇసుక రవాణాకు పచ్చజెండా

• నిర్మాణ రంగానికి అండ



జిల్లాలో నిర్మాణ రంగాన్ని తిరిగి పట్టాలెక్కించేలా, ఆగిపోయిన అభివృద్ధి పనులను తిరిగి మొదలు పెట్టేలా, నిర్మాణ రంగ కార్మికులకు పనులు కల్పించేలా జిల్లాలో ఇసుక రవాణాకు అధికారయంత్రాంగం పచ్చజెండా వూపింది. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా నిర్మాణ పనులు చేపట్టిన వారికి ఇసుక కొరత రానీయకుండా చేయాలని నిర్ణయించారు.

జిల్లాలో పొట్టేపాలెం, సజ్జాపురం, గొల్లకందుకూరు, మినగల్లు, విరువూరు, ముదివర్తిపాలెం, పడమటి కంభంపాడు, అప్పారావుపాలెం, పల్లిపాడు తదితర ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లున్నాయి. వీటికి అనుబంధంగా ఆయా ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లను కూడా ఏర్పాటు చేశారు. లాక్‌డౌన్‌కు ముందు కొత్తగా ఆరు రీచ్‌లకు టెండర్లు పిలిచారు. అయితే ఆ ప్రక్రియ ఇంకా పూర్తి కాక కొత్త రీచ్‌లు తెరచుకోలేదు.

దాదాపు 50రోజుల పాటు ఇసుక రీచ్‌ల వద్ద రవాణా నిలిచిపోయింది. లాక్‌డౌన్ మూలంగా నిర్మాణ పనులు ఆగిపోవడంతో ఇసుక రవాణా అవసరం రాలేదు. ఆయా ప్రాంతాలలో ప్రభుత్వ అభివృద్ధి పనులు కూడా ఆగిపోయాయి.

అయితే లాక్‌డౌన్ తర్వాత నిర్మాణ పనులు యధావిధిగా మొదలవుతాయి. సడలింపుల్లో ప్రభుత్వ అభివృద్ధి పనులు, నిర్మాణాలు కూడా వున్నాయి. ఇసుకకు తీవ్రస్థాయిలో డిమాండ్ ఉంటుంది. అదీగాక ఈసారి జూన్ లోనే వర్షాలు పడే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వర్షాలు పడితే రీచ్‌ల నుండి ఇసుక తవ్వకాలు నిలిచిపోతాయి. దీంతో ముందు జాగ్రత్తగా ఇసుక డంపింగ్‌కు శ్రీకారం చుడుతున్నారు. 3లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేసేలా నెల్లూరు, కోట ప్రాంతాలలో రెండు భారీ స్టాక్ రిజర్వ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే వింజమూరు, వెంకటగిరి, కావలి, ఉదయగిరి, సూళ్లూరుపేట లలో ఇసుక డిపోలను ఏర్పాటు చేసి, ముందుగానే ఇసుకను స్టాక్ చేస్తారు. వర్షాకాలంలో రీచ్‌ల నుండి ఇసుక రవాణా లేకపోతే నిర్మాణదారులు ఈ డిపోల నుండి ఇసుకను పొందవచ్చు. ఎలాంటి పరిస్థితులు వచ్చినా నిర్మాణాలు ఆగిపోకూడదనే లక్ష్యంతోనే ఇసుకపై పక్కా ప్రణాళికతో అధికార యంత్రాంగం వ్యవహరిస్తోంది.

• జిల్లాలో...

# కలవరపెడుతున్న కోయంబేడు



చెన్నైలోని కోయంబేడు మార్కెట్ కరోనాకు హాట్ స్పాట్‌గానే కాదు, వైరస్ విస్తరణ కేంద్రంగా కూడా మారింది. కోయంబేడు మార్కెట్‌తో నెల్లూరు జిల్లాకు లింకు వుండటంతో జిల్లా వాసుల్లోనూ కలవరం మొదలైంది. కోయంబేడు నుండి సూళ్లూరుపేట మార్కెట్‌కు కూరగాయలు, పండ్లు రవాణా అవుతుంటాయి. నెల్లూరులోని కూరగాయల మార్కెట్‌కు గతంలో కోయంబేడు నుండి ఏమీ వచ్చేవి కాదుగాని, ఈ కరోనా సీజన్‌లో కొన్ని కూరగాయలను మాత్రం అక్కడ నుండి తెప్పించుకున్నారు.

కోయంబేడు మార్కెట్‌లో పని చేసేవాళ్లలో ఎక్కువ మోతాదులో కరోనా పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. దీంతో నెల్లూరు, సూళ్లూరుపేట మార్కెట్ల విషయంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నెల్లూరు, సూళ్లూరుపేట లలోని కూరగాయల మార్కెట్లలో పని చేస్తున్న వారందరికీ ట్రూనాట్ కిట్ల ద్వారా కరోనా టెస్ట్‌లు నిర్వహించారు. నెల్లూరు మార్కెట్‌లో పనిచేసే వాళ్లలో ఇంకా కేసులు బయటపడలేదుగాని సూళ్లూరుపేటలో ఒక్కసారిగా 10 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో సూళ్లూరుపేట ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఈ పదిమందితో కాంటాక్ట్ వున్న ప్రతిఒక్కరినీ క్వారంటైన్‌కు తరలించారు. పాజిటివ్‌గా తేలినవాళ్లను నెల్లూరులోని జిజిహెచ్, నారాయణ కోవిడ్ ఆసుపత్రులలో ఐసోలేషన్‌కు తరలించి చికిత్సనందిస్తున్నారు.

# మూడో జేసీగా ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు జిల్లాలో ఇప్పటికే ఇద్దరు జాయింట్ కలెక్టర్లుండగా మూడవ జేసీగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభాకర్‌రెడ్డిని నియమిస్తూ ఈనెల 10న ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై వీరిని జేసీ రైతు భరోసా, రెవెన్యూ (ఆర్‌బీ-ఆర్), జేసీ- గ్రామ వార్డు సచివాలయాలు, అభివృద్ధి(డబ్ల్యూఎస్-డీ), జేసీ- ఆసరా, సంక్షేమం(ఏ అండ్ డబ్ల్యూ)గా పిలుస్తారు. పాలనలో కలెక్టర్‌కు అండగా ఈ ముగ్గురు జేసీలు పనిచేస్తారు. వారిలో ఇద్దరు ఐఏఎస్‌లు, ఒకరు ఎస్ఎఎస్ ఉంటారు. కొత్తగా నియమితులైన జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రస్తుతం ల్యాండ్స్ అండ్ సర్వే రికార్డ్స్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. గ్రూప్-1 నుంచి ఐఏఎస్‌కు ఉద్యోగోన్నతి పొందారు. గతంలో పలు జిల్లాల్లో ఆర్డీవోగా పనిచేసిన అనుభవం ఉంది. ఇప్పటికే జేసీగా డాక్టర్ వినోద్‌కుమార్, జేసీ-2గా కమలకుమారి పని చేస్తున్నారు. ఈ ముగ్గురికి ప్రభుత్వం పలు శాఖలను విభజించింది.

**జేసీ(ఆర్-ఆర్) డాక్టర్ వినోద్‌కుమార్ శాఖలు**

వ్యవసాయం, పౌరసరఫరాలు, మార్కెటింగ్, సహకారం, పశుసంవర్ధక శాఖ, ఉద్యానవన శాఖ, మత్స్యశాఖ, సెరీకల్చర్, రెవెన్యూ, సర్వే, విపత్తుల నిర్వహణ, జలవనరులు, శాంతి భద్రతలు, ఎక్సైజ్, గనులు, ఇంధనశాఖలు,

**జేసీ(వీడబ్ల్యూఎస్-డీ) ఎన్.ప్రభాకర్‌రెడ్డి శాఖలు**

శాఖలు గ్రామ, వార్డు సచివాలయాలు, గ్రామ, వార్డు వలంటీర్లు, పంచాయితీరాజ్, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలు, పాఠశాల, సాంకేతిక, ఉన్నత విద్య, పురపాలక, పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణం, మీ-సేవ, ఆర్టీజీ, ఐటీఈ, సీ విభాగాలు, ఇంధన, జలవనరుల శాఖలు మినహా మిగిలిన అన్ని రకాల ఇంజనీరింగ్ విభాగాలు.

**జేసీ(ఏ అండ్ డబ్ల్యూ) కమలకుమారి శాఖలు**

శాఖలు డీఆర్డీఏ-డీడబ్ల్యూఎంఏ, అన్ని రకాల సంక్షేమం (మహిళ, శిశు, బీసీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మైనారిటీ సంక్షేమం), పరిశ్రమలు, వాణిజ్యం, దేవాదాయ, సిల్క్ డెవలప్‌మెంట్.

# కరోనా తర్వాత కోలుకునేదెవరు?

**క్రీస్తుపూర్వం, క్రీస్తు శకం అంటూ ఇప్పటివరకు కాలాలను విభజించారు. ఇక ముందటి కాలం కరోనాకు ముందు, కరోనా తర్వాత అన్నట్లుగా వుండబోతుంది. కరోనా ప్రపంచ దేశాల తలరాతనే మార్చబోతోంది. వ్యక్తులు, సంస్థల భవిష్యత్‌ను తల్లక్రిందులు చేయబోతోంది.**



కరోనాకు ముందు కాలాన్ని మనం చూశాం. పలు రంగాలలో అప్పుడప్పుడు ఒడిదుడుకులు ఎదురైనా అన్ని రంగాల ప్రస్థానం సాఫీగా జరిగింది. కాని కరోనా దెబ్బకు పలు రంగాల పరిస్థితి తల్లక్రిందులు కాబోతోంది. అసలు ఈ రంగాలు ఎప్పటికి కోలుకుంటాయో కూడా చెప్పలేని పరిస్థితి.

కరోనా మూలంగా దారుణంగా దెబ్బతిన్న రంగాలలో రియల్ ఎస్టేట్ ఒకటి. ఈ రంగానికి ఎదురుదెబ్బలు అలవాటే! అయితే కరోనా దెబ్బ మాత్రం ఈ రంగానికి చాలా కరుకుగానే తగిలింది. కరోనా ప్రభావంతో నిర్మాణ రంగం స్థంభించిపోయింది. మార్కెటింగ్ ఆగిపోయి ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయి. రియల్ ఎస్టేట్‌లో ఏర్పడిన ప్రతిష్టంభన ప్రభావం బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలతో పాటు ఎన్నో వ్యాపార రంగాలపై పడబోతోంది.

కరోనా మూలంగా ఆతిథ్య రంగం కుదేలయ్యింది. కరోనాతో తీవ్రంగా నష్టపోయిన రంగమిది. కరోనా వైరస్ ప్రబలడంతోటే ఇది మూతపడింది. కరోనా వైరస్ నుండి బయటపడ్డాక కూడా ఈ ఆతిథ్య రంగం కోలుకోవడానికి ఒకట్రెండేళ్ళు పట్టే అవకాశముంది. కరోనా తర్వాత కూడా హోటల్స్, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, బేకరీల వంటి వ్యాపారాలు తిరిగి పుంజుకోవడానికి చాలా కాలవే పట్టొచ్చు. సినిమా, పర్యాటకం, ప్రైవేట్ ట్రావెల్స్, ఆటోమొబైల్ రంగాలు కూడా కోలుకోవడానికి ఎక్కువ కాలమే పట్టొచ్చు!




## నెల్లూరు కబుర్లు

### జాగ్రత్తలతోనే..

# కరోనా నియంత్రణ



రెడ్‌జోన్ కోటమిట్టలో పర్యటిస్తున్న మంత్రి అనిల్

జాగ్రత్తలు పాటించడం ద్వారా కరోనాను దూరం చేయవచ్చని మంత్రి డా. అనిల్ అన్నారు. ఈనెల 11న నెల్లూరు నగరంలోని 40వ డివిజన్‌లో రెడ్‌జోన్ ప్రాంతమైన మూలాపేటలో ఆయన పర్యటించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. మూలాపేటలో పాజిటివ్ కేసులు నమోదు కావడంతో రెడ్‌జోన్‌గా ప్రకటించి 11 వందల మందికి శ్యాంపిల్స్ తీశామని, ఇందులో ఏడుగురికి పాజిటివ్ వచ్చిందని చెప్పారు. స్టోన్ హౌస్‌పేటలో కూడా పాజిటివ్ కేసులు నమోదు కావడంతో వైద్యపరీక్షలు ముమ్మరం చేశామన్నారు. చెన్నైలోని కోయంబేడు మార్కెట్‌కు వెళ్తున్న వారిలో పాజిటివ్ కేసులు వస్తుండడంతో సుమారు 150 మందికి పరీక్షలు చేయడం జరిగిందని, అందులో ఒకరికి పాజిటివ్ వచ్చిందని మంత్రి తెలిపారు. ఆయన వెంట వైయస్సార్సీపి నాయకులు రూప్‌కుమార్‌యాదవ్ ఉన్నారు.

## మహారాణా ప్రతాప్‌సింగ్ జయంతి

### పేదలకు ఆహారం పంపిణీ చేసిన యశ్వంత్



మహారాణా ప్రతాప్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని నెల్లూరుజిల్లా బిజెపి నేత యశ్వంత్ సింగ్ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానంగా లాక్‌డౌన్ నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఆహారాన్ని పంపిణీ చేశారు. నెల్లూరు నగరంలోని పొర్లుకట్ట ప్రాంతంలో ఆయన పర్యటించి స్థానికులకు ఆహారం ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా యశ్వంత్‌సింగ్ మాట్లాడుతూ 1540 మే9న జన్మించిన మహారాణా ప్రతాప్‌సింగ్ ధైర్యానికి మారుపేరని చెప్పారు. విదేశీ పాలకులను ఎదిరించి భారత దేశ రక్షణ కోసం, ప్రజల కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టిన పరాక్రమవంతుడు ప్రతాప్‌సింగ్ అని కొనియాడారు. నగరంలోని పొర్లుకట్ట చివర ప్రాంతంలో నివసిస్తున్న వారంతా నిరుపేదలని గుర్తు చేశారు. వారి నివాసాలు కూడా సక్రమంగా లేవని ప్రభుత్వం స్పందించి వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, మధు, శ్యామ్ పాల్గొన్నారు.

### మంచినీళ్ళ సమస్య ఉంటే

# ఫోన్ చేయండి

**- కార్పొరేషన్ కమిషనర్ బాపిరెడ్డి**

వేసవి తీవ్రత దృష్ట్యా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కాల్‌సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశామని కార్పొరేషన్ కమిషనర్ బాపిరెడ్డి ఇటీవల తెలియజేశారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే కార్యాలయం పని వేళల్లో 63019 56002 ఫోన్ నంబరుకు కాల్ చేసి తెలియజేస్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.

### దుకాణాలపై అధికారుల

# ఆకస్మిక దాడులు

నెల్లూరు నగరంలోని వేదాయపాళెం, కరెంటాఫీసు సెంటర్, భక్తవత్సలనగర్, అయ్యప్పగుడి తదితర ప్రాంతాల్లోని దుకాణాలపై తూనికలు కొలతల శాఖ, విజిలెన్స్ అధికారులు ఈనెల 10న ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిత్యావసర సరుకులను అధిక ధరలకు విక్రయిస్తున్న ఒక ప్రొవిజన్స్ షాపుపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో తూనికలు కొలతల శాఖ డెప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్, ఇన్స్పెక్టర్ సాయిశ్రీకర్, విజిలెన్స్ సిఐ మాణిక్యాల రావు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అనుమతులను అతిక్రమిస్తూ అదనంగా నిర్మించిన కట్టడాలను శనివారం కూల్చివేశారు. స్థానిక మినీబైపాస్ గోమతినగర్ ప్రాంతంలోని రెండు అపార్టుమెంట్లలో కార్పొరేషన్ అనుమతులు లేకుండానే పెంట్‌హౌస్ గదులు నిర్మిస్తున్నట్లు సమాచారం అందుకున్న డిసిపి ప్రసాద్ నిర్మాణ స్థలానికి చేరుకుని కట్టడాలను పరిశీలించారు. నగర పాలక సంస్థ మంజూరు చేసిన అనుమతులను అతిక్రమించారని నోటీసులు జారీ చేస్తూ అదనపు నిర్మాణాన్ని కూల్చివేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ కార్పొరేషన్ నుంచి తగిన అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### కరోనా నివారణకు

## హేచరీస్ అసోసియేషన్ వితరణ

కరోనా వ్యాధి నివారణ కార్యక్రమాలకు నెల్లూరుజిల్లా రొయ్యపిల్లల హేచరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న జిల్లా సహాయ నిధికి 7.75 లక్షల రూపాయలు, ముఖ్యమంత్రి సహాయనిధికి మరో 2.60 లక్షల రూపాయలు మొత్తం 10.35 లక్షలను విరాళంగా అందజేశారు. ఆ చెక్కులను అసోసియేషన్ అధ్యక్షుడు సాగర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ఎం.వి శేషగిరిబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి రాజన్, కోశాధికారి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# విశ్వసాయి ట్రూఎడ్ యాప్

జూలై నెలలో జరిగే నీట్, జేఈఈ మెయిన్స్, ఎంసెట్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ట్రూఎడ్ అనే యాప్ ని ఈనెల 10న విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ విడుదల చేశారు. దీని ద్వారా ప్రతి రోజు అన్ని సబ్జెక్టులకు వీడియో తరగతులు, అసైన్‌మెంట్లు అందుబాటులో ఉంటాయన్నారు. జూనియర్ ఇంటర్ సిలబస్‌పై 5పరీక్షలు, సీనియర్ ఇంటర్ సిలబస్ పై 5 పరీక్షలతో పాటు 10 నుంచి 14 గ్రాండ్ టెస్ట్‌లు ఉంటాయన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడానికి ప్రత్యేక పోర్టల్ అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి పరీక్ష తర్వాత పేపర్ డిస్కషన్ వీడియోలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇంటి వద్ద పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ యాప్ చాలా ఉపయుక్తంగా ఉంటుందని, కోచింగ్‌కు సంబంధించిన షెడ్యూల్ ముందుగానే అప్ లోడ్ అవుతుందని తెలిపారు.

# అరుణమ్మకు నివాళి



నెల్లూరు నగరంలోని గోమతినగర్‌లో ఉన్న శ్రీసత్యసాయిబాబా ఆశ్రమంలో అనాథపిల్లలు, వృద్ధులకు పదిహేను రోజులకు సరిపడా నిత్యావసరాలను ఈనెల 11న దాత పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. అదేవిధంగా వారికి పండ్లు, శానిటైజర్లు కూడా పంపిణీ చేశారు. తన భార్య పందిళ్ళపల్లి అరుణమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమం చేపట్టామని పట్టాభిరామిరెడ్డి చెప్పారు. లాక్‌డౌన్‌తో ఇబ్బందులు పడుతున్న పేదలకు తనవంతుగా నిత్యావసర సరుకులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌సి వాకర్స్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు మురళి, కన్వీనర్ శేషు తదితరులు పాల్గొన్నారు.

# ఫారెన్ క్వారంటైన్

విదేశాల నుంచి వస్తున్న వారి కోసం నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఆవరణంలో ఉన్న ఎస్ఎస్ఏ సమావేశ మందిరంలో ఫారెన్ క్వారంటైన్ కోవిడ్ సెల్ ఈనెల12న ప్రారంభమైంది. విదేశాల నుంచి నెల్లూరుకు వచ్చే వారు, విదేశాలకు వెళ్ళే వారి వివరాలన్నీ ఈ సెల్‌లో నమోదు చేసుకుంటారని ఎస్ఎస్ఏ ఏపీసీ, క్వారంటైన్ నోడల్ అధికారి డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. విదేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రానికి చెందిన 15,555 మంది జూన్ 15వ తేది లోపు వస్తున్నట్లు, వీరందరి వివరాలు సేకరించడంతోపాటు వారు విమానాశ్రయంలో దిగిన వెంటనే క్వారంటైన్‌కు పంపించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### స్పందన వెబ్‌సైట్‌లో

# వలస కూలీల వివరాలు

నెల్లూరు జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్ళేవారు, ఇతర రాష్ట్రాల నుంచి, జిల్లాల నుంచి నెల్లూరు జిల్లాకు వచ్చే వలస కూలీలు, ఇతరుల పూర్తి వివరాలను సేకరించి స్పందన వెబ్ సైట్‌లో నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 11న నెల్లూరు జడ్పీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు వెళ్ళాలనుకునే వారు, ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి జిల్లాకు రావాలనుకునే వారు స్పందనలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్పందనలో వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయన్నారు. ప్రతి దరఖాస్తును పూర్తి స్థాయిలో పరిశీలించాలన్నారు. జిల్లాకు వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి క్వారంటైన్‌కు తరలించి పూర్తి వివరాలు స్పందనలో నమోదు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్ళే వారి వివరాలు సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. నెగటివ్ వస్తేనే ప్రయాణానికి సిద్ధం చేయాలన్నారు. జిల్లాకు వచ్చే వారి కోసం గ్రామ, వార్డు కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కమిటీలు వైద్య పరీక్షలు చేయించిన 14రోజుల తర్వాత హౌస్ క్వారంటైన్‌కు తరలిస్తామన్నారు. ఉపాధ్యాయులకు కోవిడ్-19 విధులు వేయాలని సూచించారు. కోవిడ్-19 విధులకు హాజరయ్యే అధికారులు, ఉద్యోగులు, కమిటీలు, సమన్వయంతో పనిచేయాలన్నారు. ట్రైనీ కలెక్టర్ కల్పనాకుమారి, జేసీ-2 కమలకుమారి, డీఆర్వో మల్లిఖార్జున, డీఆర్డీయే పీడీ శీనానాయక్, జెడ్పీ సీఈవో సుశీల పాల్గొన్నారు.

### ఆన్‌లైన్ తరగతుల నిర్వహణకు

# అనుమతి లేదు

**- జిల్లా విద్యాశాఖాధికారి జనార్దనాచార్యులు**

విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతి లేదని, ఒకవేళ ఎవరైనా ఆన్‌లైన్ తరగతులు పేరుతో విద్యార్థుల నుంచి ఫీజులు వసూలుచేసినట్లు తెలిస్తే ఆయా పాఠశాలల గుర్తింపును రద్దు చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దనాచార్యులు ఇటీవల ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ కమిషన్ సభ్యుడు ప్రొ. నారాయణరెడ్డి ఆ మేరకు ఆదేశాలు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. నూతన విద్యాసంవత్సరంలో అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు త్రైమాసిక ఫీజును మాత్రమే వసూలు చేయాలని, ఫీజు చెల్లించలేదని విద్యార్థి అడ్మిషన్‌ను రద్దుచేస్తే పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు.

# గృహ నిర్మాణ సంస్థ విరాళం

నెల్లూరు గృహ నిర్మాణ సంస్థ అధికారులు, ఉద్యోగులు కరోనా నివారణ సహాయార్థం 1,18,938 రూపాయలను చెక్కు రూపంలో ఈనెల 8న జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు, జేసీ డా.వినోద్‌కుమార్‌లకు ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్‌వీఆర్ ప్రసాద్ ద్వారా అందజేశారు.



నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 6వ వర్ధంతి పురస్కరించుకొని వాకాడు గ్రామంలోని పేదలకు కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

# పెద్దాయనకు నివాళి

మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఈనెల 9న విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీలో నేదురుమల్లి చిత్రపటానికి కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతి రవీంద్రరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటగిరిలో నేదురుమల్లి నివాసంలో జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి సీనియర్ నాయకుడు చెలికం శంకరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. వాకాడులో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 6వ వర్ధంతిని పురస్కరించుకొని నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా గ్రామంలోని 2600 కుటుంబాలకు కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే ఈనెల 11వతేదిన వాకాడులోని 3వేల కుటుంబాలకు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెత్తబుట్టలు పంపిణీ చేశారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపర్చాలని అధికారులు, పంచాయతి సిబ్బందిని అయన కోరారు. పొడి చెత్త, తడి చెత్త వేరుగా వేసేందుకు రెండు బుట్టలు ఇచ్చారు.

అదేవిధంగా నెల్లూరు నగరంలోని పొదలకూరురోడ్డులో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి టి.బాలసుధాకర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు నేదురుమల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



# పరిశ్రమల్లో పకడ్బందీగా రక్షణ చర్యలు

**- కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు**



లాక్‌డౌన్ నిబంధనల ప్రకారం జిల్లాలో పున:ప్రారంభించిన పరిశ్రమల్లో రక్షణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని, పరిశ్రమల యాజమాన్యాలు ఆయా రక్షణ చర్యలకు సంబంధించిన ప్రత్యేక రిజిస్టర్లు తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు ఆదేశించారు. ఈనెల 11న ఆయన నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఈ విషయాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్యాస్ కంపెనీల్లో గ్యాస్ లీకేజీ అలర్ట్ సిస్టం సక్రమంగా పనిచేస్తోందా లేదా అన్నది తప్పకుండా పరిశీలించాలన్నారు. ఎప్పటికప్పుడు పరిశ్రమలను ఆ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి పరిశీలిస్తుండాలన్నారు. పోలీసులు, ఫైర్ సేఫ్టీ అధికారులు, పంచాయతిరాజ్, కార్మిక శాఖ, విద్యుత్ అధికారులతో కమిటీలు ఏర్పాటుచేసి పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ మాట్లాడుతూ తనిఖీ సమయంలో పరిశ్రమల్లో ఎలాంటి లోపాలు కనిపించినా పరిశ్రమలను మూసివేస్తామని హెచ్చరించారు. పరిశ్రమల శాఖ డిప్యూటి చీఫ్ పరమేశ్వరరావు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఇ.ఇ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోటి పరిహారంపై విమర్శలా?..

- ఇలాంటి ప్రతిపక్షం ఎక్కడా లేదు
- టిడిపి నేతలపై మంత్రి డా.అనిల్ ధ్వజం



విశాఖలో గ్యాస్ లీకేజీ ఘటనలో మృతుల కుటుంబాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కోటి రూపాయల వంతున పరిహారం ప్రకటిస్తే దానిని కూడా టిడిపి నాయకులు వక్రీకరించి విమర్శలు చేయడం ఏమిటని, అసలు ఇలాంటి ప్రతిపక్షం ఎక్కడా లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్ దుయ్యబట్టారు.

ఈనెల 9న నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి నాయకుల విమర్శలు అర్థరహితమన్నారు. తొలుత మంత్రి అనిల్ నెల్లూరు నగరంలోని జడ్పీ కార్యాలయంలో జిల్లా అధికారులతో కరోనా వ్యాధిపట్ల తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్‌లలో చిక్కుకున్న 74 మందిని త్వరలోనే జిల్లాకు తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా కర్నూలు జిల్లాలో బ్యాంకు పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులను కూడా జిల్లాకు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు తగ్గుతున్నాయని ఆయన అంటూ అందుకు నిరంతరం కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు వైద్య సిబ్బంది, రెవెన్యూ, పారిశుద్ధ్య సిబ్బంది, పోలీసుల సేవలను మంత్రి కొనియాడారు.

అనంతరం మంత్రి ఇస్కాన్‌సిటీలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశమై పేదలకు త్వరలో పంపిణీ చేయనున్న ఇళ్ళ స్థలాలపై సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత, నగరంలో రెడ్‌జోన్‌గా ఉన్న 43వ డివిజన్‌లోని జెండావీధి, కోటమిట్ట ప్రాంతాల్లో అధికారులతో కలసి మంత్రి పర్యటించారు. పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

### రెడ్‌క్రాస్ సేవల్లో..

# నెల్లూరు జిల్లా అగ్రగామి

**- కమిటీ చైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి**



రాష్ట్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవల్లో నెల్లూరు జిల్లా ప్రధమ స్థానంలో ఉందని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 8న ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు రెడ్‌క్రాస్ రక్తనిధిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యుద్ధ సమయాల్లో క్షతగాత్రులకు వైద్యసేవలందించేందుకు రెడ్‌క్రాస్ సంస్థ ప్రారంభమైందని, ఈ సంస్థ వ్యవస్థాపకుడైన హెన్రీ డ్యూనాంట్ జయంతిని రెడ్‌క్రాస్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో అనేక విభాగాలతో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలందిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం కరోనా వ్యాధి మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో రెడ్‌క్రాస్ విపత్తుల నిర్వహణ విభాగం వారు పోలీసులతో కలసి సేవలందిస్తున్నారని తెలిపారు. నిరాశ్రయులైన వారికి రోజూ భోజన వసతి కల్పిస్తున్నామని చెప్పారు. డిసిహెచ్‌ఎస్ అధికారి డాక్టర్ చెన్నయ్య మాట్లాడుతూ కరోనా మహమ్మారి పెట్రేగిపోతున్న నేటి విపత్కర పరిస్థితుల్లో రెడ్‌క్రాస్ వారు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమైనవని కొనియాడారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్‌లో సేవలందిస్తున్న స్వచ్ఛంధ సేవకులను తమ కరతాళధ్వనులతో అందరూ అభినందించి పూలతో అభిషేకించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కమిటీ వైస్‌ఛైర్మెన్ సుధీర్‌నాయుడు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, కావలి శాఖ ఛైర్మెన్ రవిప్రకాష్‌తో పాటు మాల్యాద్రి, సెక్రటరీ మస్తానయ్య, రీజనల్ కో-ఆర్డినేటర్ గంటా వెంకటకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కావలిలో రెడ్‌క్రాస్ వ్యవస్థాపక దినోత్సవం

కావలిలో రెడ్‌క్రాస్ రక్తనిధి భవనంలో ఈనెల 8న రెడ్‌క్రాస్ వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు డ్యూనాట్ హెన్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కావలి సబ్‌కలెక్టర్ శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని రెడ్‌క్రాస్ సేవకులను అభినందించారు. అనంతరం అబ్దుల్‌కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో 60 మంది రక్తదానం చేశారు.

ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు దామిశెట్టి సుధీర్‌నాయుడు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ కె. సుబ్బారావు, గంధం ప్రసన్నాంజనేయులు, అమరా వేదగిరి, సాయితేజ, ప్రణీత్, లక్ష్మీనంద, సయిూం, మధుసూర్య తదితరులు పాల్గొన్నారు.

## పేర్నాటి ట్రస్ట్ ఆధ్వర్యంలో
# పౌష్టికాహారం పంపిణీ



పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదప్రజలకు పౌష్టికాహారాన్ని అందించి తమ సేవాభావం చాటుకున్నారు. కోట మండలంలోని పుచ్చలపల్లి పంచాయతీలో ఉన్న దైవాలదిబ్బ, దొరువుకట్ట గ్రామాల్లోని 860 కుటుంబాల వారికి ఇటీవల దజను కోడిగుడ్లు వంతున పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాదర్తి రాధాకృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యుడు కుదురు శ్రీనివాసులు, దువ్వూరు సాయికృష్ణారెడ్డి, పలగాటి సాయి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మద్యాన్ని పూర్తిస్థాయిలో నిషేధించాలి



తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న టిడిపికి చెందిన మహిళలు

మద్యాన్ని పూర్తిస్థాయిలో నిషేధించాలని కోరుతూ గూడూరులోని టిడిపికి చెందిన పలువురు మహిళలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం తహశీల్దార్ బాలలీలారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ అధ్యక్షురాలు మట్టం శ్రావణి మాట్లాడుతూ ఈ కరోనా కష్టకాలంలో మద్యం దుకాణాలు తెరవడంతో ఇళ్ళల్లో మహిళలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన సంక్షేమ పథకాల డబ్బులు, ముసలివాళ్ళకు ఇచ్చిన పింఛన్ డబ్బులను కూడా మగవాళ్ళు లాక్కునిపోయి మద్యానికి తగలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంపూర్ణ మద్యనిషేధం విధించి మహిళా లోకాన్ని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కస్తూరి విజయమ్మ, గుండాల భారతి, తాళ్ల సుబ్బమ్మ, పద్మమ్మ, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నిరాశ్రయులకు భోజన సదుపాయం




గూడూరు రూరల్ పరిధిలోని గాంధీనగర్ మినీ గురుకులంలో మెప్మా, మునిసిపాలిటీ వారి సౌజన్యంతో మైఫ్రెండ్స్ సభ్యుల ఆధ్వర్యంలో, తాత్కాలిక నిరాశ్రయుల వసతిగృహంలో ఉన్న వందమంది నిరాశ్రయులకు ఈనెల 12న భోజన సదుపాయం కలిగించారు. ఆంధ్రమహిళామండలి సభ్యురాలు శ్రీకంటి రాజ్యలక్ష్మి దాతృత్వంతో వారికి ఈ సాయం అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని గమళ్ళపాళెంలో ఉన్న ఓం సాయిరాం చారిటీస్‌లో ఉన్న వృద్ధులకు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రమహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ చెరుకూరు రోహిణి, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు మల్లాబత్తిన జీవనిరెడ్డి, రాజ్యలక్ష్మి, సుప్రియ, విష్ణువందన, మై ఫ్రెండ్స్ అధ్యక్షుడు రాహుల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



కరోనా కష్టకాలంలో చేగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మద్దు సురేష్‌బాబు ఆధ్వర్యంలో గిరిజనులకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న తహశీల్దార్ బాలలీలారాణి తదితరులు



## గూడూరు డివిజన్ వార్తలు

### పేదలను ఆదుకుంటున్న
# ఎన్ఎస్ఆర్ ట్రస్ట్



దివంగత నాయకుడు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా వైయస్సార్సీపి మండల కన్వీనర్ మల్లు విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గూడూరు మండలంలోని విందూరు, రామలింగాపురం, మిట్టాత్మకూరు గ్రామ సచివాలయాల్లోని 90 మంది సిబ్బందికి, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వలంటీర్లకు ఈనెల 11న నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ చేతులమీదుగా ఈ సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపు మేరకు వైయస్సార్సీపి నాయకులు తమ సొంత నిధులతో కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, రాజారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ బాబురెడ్డి, మేడనూరు శ్రీనివాసులురెడ్డి, రాధారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు యల్లా శ్రీనివాస్‌రెడ్డి, కొండారెడ్డి, వెడిచర్ల శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, వెంకటరెడ్డి, రమణారెడ్డి, శ్రీహరినాయుడు, సుబ్బానాయుడులతో పాటు రూరల్ ఎస్ఐ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

- కౌన్సిలర్ రమేష్ దాతృత్వం

# వలస కూలీలకు ఆహారపొట్లాలు



లాక్‌డౌన్ కారణంగా మహారాష్ట్ర, ఒరిస్సా, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లోని తమ స్వస్థలాలకు నడిచి, లేదా సైకిళ్ళపై వెళ్ళిపోతున్న వలసకూలీలకు మార్గ మధ్యంలో గూడూరులోని 27వ వార్డు కౌన్సిలర్ బాలిబోయిన రమేష్ దాతృత్వంతో ఆహార ప్యాకెట్లను అందజేస్తున్నారు. రోజుకు సుమారు 150 మంది వలస కూలీలకు 10 రోజులుగా ఈ సాయం అందజేస్తున్నారు. గూడూరు సమీపంలోని బూదనం టోల్‌ప్లాజా వద్ద నుంచి వెంకటాచలం టోల్‌ప్లాజా దాకా మార్గమధ్యంలో ఆహారం అందజేసి తమ సేవాభావం చాటుకుంటున్నారు. కోదండరామయ్య, లోకేష్‌యాదవ్, శ్రీహరి, చిన్ని విజయబాబు పాల్గొన్నారు.



ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో యమహా సుబ్రహ్మణ్యం సహకారంతో పేద గిరిజన కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేస్తున్న గూడూరు బ్రేక్ ఇన్స్‌పెక్టర్ మురళీమోహన్, సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్.

# తల్లిని మించిన దైవం లేదు



తల్లిని మించిన దైవం లేనే లేదని, తల్లి లేకపోతే మనకు జన్మే లేదని, మనకు జన్మనిచ్చిన మాతృమూర్తికి జీవితాంతం రుణపడి ఉండాలని శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యాంయాదవ్ అన్నారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 10న గూడూరులోని అదవికాలనీలో ఉన్న శరణార్థుల వృద్ధాశ్రమంలోని 30మంది అనాథపిల్లలు, వృద్ధులకు ఆయన దాతృత్వంతో బ్యూరో ఆఫ్ సోషల్‌సర్వీస్ స్వచ్ఛంధ సేవాసంస్థ అధ్యక్షుడు కూరపాటి రవీంద్రబాబు ఆధ్వర్యంలో భోజనం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి గొప్పదనాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, భాస్కర్, యశ్వంత్‌తో పాటు, వృద్ధాశ్రమ నిర్వాహకులు భాషా జాన్‌పాల్, ఖాదర్‌బీబీ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు రొట్టెలు, కోడిగుడ్లు



వాలంటీర్లకు ఆహారపదార్థాలు అందజేస్తున్న తహశీల్దార్ బాలలీలారాణి, మయూరి శ్యాం యాదవ్, తాజుద్దీన్.

గూడూరులోని 23, 27,28, 29 వార్డుల్లోని మైనార్టీలకు, గిరిజనులకు, పేదలకు స్థానిక అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు తాజుద్దీన్, శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మరియు అంతర్జాతీయ మానవ హక్కులు, నేరవ్యతిరేక సేవాసంస్థ రాష్ట్ర కార్యదర్శి మయూరి శ్యామ్ యాదవ్‌ల నేతృత్వంలో రొట్టెలు, కోడిగుడ్లు, ఊరగాయలు తదితర ఆహారపదార్థాలను పంపిణీ చేశారు. గూడూరు తహశీల్దార్ బాలలీలారాణి చేతులమీదుగా 70 మంది వాలంటీర్లకు, 35 మంది మైనార్టీలకు, రావిచెరువు కట్టపై ఉన్న 45 మంది యానాదుల కుటుంబాలకు ఈ సాయం అందజేశారు. పూడి రాఘవయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు వెంకటేశ్వర్లు రాజు, మయూరి శ్యామ్‌యాదవ్ దాతృత్వంతో ఈ సాయం అందజేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

# నిరుపేద గర్భిణులకు సాయం



గూడూరులోని జేవివి ఆధ్వర్యంలో వికె షోరూం యజమాని మల్లికార్జున్ దాతృత్వంతో 60 మంది నిరుపేద గర్భిణులకు ఈనెల 9న భోజనం (వెజిటబుల్ రైస్, గ్రుడ్డు, అరటిపండు) అందజేశారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ ఉమ చేతుల మీదుగా వారికి భోజన సదుపాయం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, అశోక్, విష్ణు, రుదీప్, మనోహర్, చంద్ర, శ్రీనివాస్, డాక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# స్వస్థలాలకు బీహార్ వలస కూలీలు

నెల్లూరు జిల్లాలోని పలు మండలాల్లో చిక్కుకుపోయిన వలస కూలీలను జిల్లా అధికారులు ఈనెల 10న రెండవ ప్రత్యేకరైలులో బీహార్‌కు పంపారు. ముందుగా బీహార్‌కు చెందిన సుమారు 2345 మంది కూలీలు వారి స్వస్థలాలకు వెళ్ళేందుకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మొదట విడతగా ఈనెల 6న ప్రత్యేక శ్రామిక్‌రైలులో 1200మందిని పంపించారు. మిగతా 1145 మందిని ఈనెల 10వ తేది రాత్రి ఏర్పాటు చేసిన 2వ శ్రామికరైలులో స్వస్థలాలకు పంపారు. తొలుత జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 40 ప్రత్యేక బస్సులలో కూలీలను రైల్వేస్టేషన్‌కు చేర్చారు. వలస కూలీలను తరలించడంలో జేసీ వినోద్‌కుమార్, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, రైల్వే కమర్షియల్ అధికారి జనార్ధన్‌రావు ప్రత్యేక కృషి చేశారు.

# గిరిజనులకు నిత్యావసర సరుకులు

నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రి జనరల్‌మేనేజర్ గురుప్రసాద్ ప్రోత్సాహంతో నెల్లూరు నగరానికి చెందిన యూనిసెర్వ్ ఫౌండేషన్, విజ్ఞానభారతి సంస్థలు సంయుక్తంగా ఇటీవల కాకుటూరు, చెముదుగుంట గిరిజన కాలనీల్లో ఉన్న 20 కుటుంబాలకు బియ్యం, వంటనూనె, పప్పు దినుసులు పంపిణీచేశారు. కసుమూరులోని బాలకార్మిక పాఠశాల ఉపాధ్యాయులకు కూడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుప్రసాద్‌తో పాటు, విజ్ఞానభారతి అధ్యక్షులు ఆర్ఆర్ఎస్ ప్రసాద్, యూనిసెర్వ్ ఫౌండేషన్ ప్రతినిధులు మోహన్‌వంశీ, రంగనాయకులుతో పాటు నీటిపారుదలశాఖ ఏ.ఇ బాలసుబ్రహ్మణ్యం తదతరులు పాల్గొన్నారు.

# కరోనాకన్నా కరెంట్ ఛార్జీలే డేంజర్




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీద రవిచంద్ర

ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, కరోనా అదునుగా చూసుకుని పేద ప్రజలకు విద్యుత్ షాక్‌లను ఇస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాడు. ఈమేరకు నెల్లూరు టిడిపి కార్యాలయంలో ఈ నెల 11వ తేదీన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక వైపు కరోనా మహమ్మారితో ప్రజలు బెంబేలెత్తుతుంటే, మరోవైపు విద్యుత్ శాఖ ఇచ్చిన విద్యుత్ బిల్లులతో మూర్చపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

పేరుకు మాత్రం 500 యూనిట్లు పైన వాడే వారికే విద్యుత్ ఛార్జీలను పెంచామని చెబుతూ ప్రతిఒక్కరిపై విద్యుత్ భారాలు మోపారన్నారు. గతంలో సి-కేటగిరి కింద 1.50లక్షల వినియోగదారులు ఉంటే, నేడు 50 లక్షల మందిని తీసుకువచ్చి విద్యుత్ షాక్ రుచి చూపించిన ఘనత జగన్‌దేనని ఎద్దేవా చేశాడు. ఉదాహరణకు ఆయన ఒక విద్యుత్ బిల్లును మీడియా ముందు ప్రదర్శించాడు. అనంతరం ఒక ఎస్సీ మహిళలకు సంబంధించి ఫిబ్రవరి నెలలో 1096 బిల్లు వస్తే మార్చి - ఏప్రిల్‌కు 12,742 బిల్లును చూపించారు. అదనపు ఛార్జీలంటూ రూ. 2091 వేయడంపై ఆయన విమర్శలు గుప్పించాడు. ఇవేమైనా కరోనా ఛార్జీలా అంటూ ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించాడు. కరోనా మాటున ఇష్టారాజ్యంగా బాదిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశాడు. ఈ సమావేశంలో నుడా మాజీఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, భువనేశ్వరి ప్రసాద్, తిరుమలనాయుడు, అమృల్లా తదితరులు పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# గల్పిక: విశాఖలో చంద్రబాబు సాహస విన్యాసం

విశాఖపట్నం గోపాలపురం సమీపంలోని ఎల్‌జి పాలిమర్స్ ఇండస్ట్రీ. తెల్లారుజాముున 3.30గంటల సమయం... ఆ పరిశ్రమలో నుండి ఒక్కసారిగా స్టైరిన్ గ్యాస్ లీక య్యింది. ఆ గ్యాస్ దెబ్బకు సమీప ప్రాంతాల ప్రజలు నిద్ర లేచి పరుగు లంకించుకున్నారు. బర్రెలు, ఎద్దులు కూడా కట్లు తెంచుకుని పరుగెడుతున్నాయి. ఆ విషవాయువు ధాటికి కొంతమంది అక్కడే కుప్పకూలిపోయారు. ఈ సంఘటన గురించి తెలియగానే స్పీడ్‌స్టార్, ఏపి సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, సీపీఎం మధు, సీపిఐ నారాయణ హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. అందరూ ఫ్యాక్టరీకి దూరంగా నిలబడి వున్నారు. ఫ్యాక్టరీ నుండి గ్యాస్ లీకవుతూనే వుంది. ఎవరో ఒకరు ఫ్యాక్టరీలోకి పోయి లీక్ అవుతున్న పైపుకు సీల్ వేస్తేగాని గ్యాస్ ఆగదు. ప్రమాద తీవ్రత తగ్గదు. ప్రజలంతా వచ్చి గ్యాస్ లీక్ ఆపి మా ప్రాణాలు కాపాడండయ్యా... ఆ ఫ్యాక్టరీ చుట్టుపక్కల స్పృహ తప్పి పడిపోయి వున్న మావాళ్ళను పట్టుకొచ్చి ఆసుపత్రిలో చేర్పండయ్యా అని వేడుకుంటున్నారు. జగన్‌తో సహా ఏ ఒక్కరూ ముందుకు వెళ్లడానికి ధైర్యం చేయడం లేదు. అప్పుడు బాధితుల్లో నుండి ఒకరు... గాలిలోకి చూస్తూ... దేవుడా! మమ్మల్ని ఈ ప్రమాదం నుండి కాపాడడానికి నువ్వే దిగి రావాలి... అంటూ అరిచాడు. అంతే! మరుక్షణంలో ఒక బైక్ గాల్లో ఎగురుతూ ఫ్యాక్టరీ వైపుకు దూసుకుపోయింది. ఆ బైక్‌పై హైటెక్ రత్న చంద్రబాబు నాయుడు.. నేరుగా ఫ్యాక్టరీ వద్దకెళ్లి స్పృహతప్పి పడిపోయిన ఒక్కొక్కరిని భుజాన వేసుకుని సురక్షిత ప్రాంతానికి చేర్చాడు. చివరగా చంద్రబాబు ఫ్యాక్టరీ గేట్లను బద్దలు కొట్టుకుంటూ లోపలకు వెళ్లాడు. గ్యాస్ లీక్ అవుతున్న బాయిలర్ వద్దకు చేరుకున్నాడు. దూరంగా నిలబడిన వారంతా చంద్రబాబు తెగువకు ఆశ్చర్యపోతున్నారు. సీపీఎం మధు అయితే సీపీఐ నారాయణతో... ఆయననైతేనే ఈ రాష్ట్రాన్ని కాపాడగలడు అని అన్నాడు. నారాయణ కూడా అందుకు.. ఇందులో డౌటేముంది... ఇప్పుడు కళ్లారా చూస్తున్నాం కదా అని అన్నాడు. చంద్రబాబు అక్కడ నిలబడి ఏదన్నా గుడ్డ దొరుకుతుందేమో... బాయిలర్ లీక్ వద్ద కట్టేసి గ్యాస్ లీక్‌ను ఆపుదామనుకున్నాడు. కాని ఆయనకు దగ్గరలో అలాంటి వస్తువేదీ కనిపించలేదు. వెంటనే తన చొక్కా విప్పి... లీక్ అవుతున్న చోట దానిని చుట్టాడు. గ్యాస్ లీక్ ఆగింది. ప్రజలంతా చప్పట్లు కొట్టారు. "జయహో చంద్రబాబు" అంటూ నినాదాలు చేయసాగారు. ఆ నినాదాల హోరుకు ఇంకో గొంతు జతయ్యింది. జయహో చంద్రబాబు... జయహో... అంటూ పెద్దగా కేకలు వినిపించడంతో వంటింట్లో వున్న నారా భువనేశ్వరి, బెడ్‌రూంలో దేవాన్ష్‌కు పాలు, కూరగాయలు అమ్మకాలపై చిట్కాలు నేర్పుతున్న బ్రాహ్మణిలు పరుగెత్తుకుంటూ నారా లోకేష్ బెడ్‌రూంలోకి వచ్చారు. లోకేష్ నిద్రలోనే "జయహో చంద్రబాబు" అని అరుస్తున్నాడు. బ్రాహ్మణి నీళ్ల తెచ్చి లోకేష్ ముఖాన చల్లింది. లోకేష్ ఉలిక్కిపడి లేచాడు. ఏమైందిరా నిద్రలో ఏంటా కలవరింతలు అని భువనేశ్వరీదేవి అడిగింది. విశాఖపట్నంలో ఎల్‌జి పాలిమర్స్ ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్‌ను నాన్నారు ధైర్యంగా వెళ్లి ఆపాడమ్మా అని అన్నాడు. భువనేశ్వరీదేవి మనసులో... వీడికి కల వచ్చినట్లుందనుకుని, అక్కడ మీ నాన్న గ్యాస్ లీక్ ఆపడం కాదు, ఇక్కడ గ్యాస్ లీక్ అయినట్లుంది చూసుకో అంటూ ముక్కు మూసుకుని వంటింట్లోకి వెళ్లిపోయింది. లోకేష్ అప్పటిదాకా తనకు వచ్చింది కల అని గ్రహించేసరికి 10 నిముషాలు పట్టింది. బ్రాహ్మణి వుండి... ఏంటి ఈ కలవరింతలు అని అడిగింది. దానికి లోకేష్... విశాఖపట్నం ఫ్యాక్టరీ సంఘటనపై నిన్న నాన్నగారు ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు కదా! జగన్ విశాఖపట్నంలో ఒక్క గంటే వున్నాడు. అదే నేనైతే ఫ్యాక్టరీలోకి కూడా పోయి వుండేవాడిననీ... నాన్నగారే సీఎంగా వుందుంటే ఈ సంఘటనపై ఎలా రియాక్ట్ అయ్యుండేవారా అని ఆలోచిస్తూ పడుకున్నాను... దాంతోనే నాన్నగారు నా కలలోకి హీరోలా వచ్చారు అని చెప్పాడు. సరేగాని, మామగారు నిన్ను పిలుస్తున్నారు, ఆయన ఆఫీస్ రూంలో వున్నారు, వెళ్లండి అని చెప్పి బ్రాహ్మణి వెళ్లిపోయింది.

లోకేష్ ఒళ్లు విరుచుకుంటూ చంద్రబాబు ఆఫీస్‌రూం వైపుకు వచ్చాడు. అప్పటికే అక్కడ 'ఏబిఎన్' విలేకరి గాసిప్ గన్నారావు ఉన్నాడు. లోకేష్ ముందు మైక్ పెట్టి.... విశాఖపట్నం ప్రమాద బాధితులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఒక కోటి రూపాయల నష్టపరిహారం ప్రకటించారు, దీనిపై మీరేమంటారు అని అడిగాడు. లోకేష్ దానికి స్పందిస్తూ... ఇది చాలా అన్యాయం, కోటి రూపాయలు వాళ్లకు ఏ మూలకొస్తాయి, ఒక్కొక్క కుటుంబానికి పాతిక లక్షలైనా ఇవ్వాలని నేను డిమాండ్ చేస్తున్నాను అని అన్నాడు. గాసిప్ గన్నారావు వుండి... అదేంటి సార్, పాతిక లక్షల కంటే ఒక కోటి పెద్దమొత్తం కదా అని ఆశ్చర్యంగా అడిగాడు. దానికి లోకేష్ అతనివైపు ఎగతాళిగా చూస్తూ... నీకు లెక్కలు చెప్పిన సన్నాసి ఎవరయ్యా... ఒకటి పెద్దదా? పాతిక పెద్దదా...? కొంచెం బ్రెయిన్ వాడండి అంటూ ఆఫీసు రూంలోకి వెళ్లాడు.

అక్కడ చంద్రబాబుతో పాటు అచ్చెన్నాయుడు, కాల్వ శ్రీనివాసులు, దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వున్నారు. ఏంటి నాన్నగారు పిలిచారట అని లోకేష్ అడిగాడు. విశాఖ సంఘటనపై అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీని వేస్తున్నాను, ఇందులో నువ్వు, కాల్వ శ్రీనివాసులు కూడా వుంటారు అని చంద్రబాబు అన్నాడు. సోమిరెడ్డి అంకుల్‌ను కూడా వేయొచ్చుకదా అని లోకేష్ అడిగాడు. చంద్రబాబు అందుకు... ఇది గ్యాస్ లీక్ సంబంధిత అంశం. బాడీ బలంగా ఉండాలి... సోమిరెడ్డి అంకుల్ తట్టుకోలేడు అని చెప్పాడు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ఐఏఎస్‌లతో కమిటీ వేశాడు కదా అని లోకేష్ ప్రశ్నించాడు. ఆ ఐఏఎస్‌లకు సబ్జెక్ట్ వుండదు... బుర్ర వుండదు అని చంద్రబాబు అన్నాడు. ఐఏఎస్ పాస్ అయినవాళ్లకు సబ్జెక్ట్ లేకుండా ఎలా పోతుంది అని లోకేష్ సందేహం వెలిబుచ్చాడు. అప్పుడు సోమిరెడ్డి అందుకుని... ఐఏఎస్‌లకు సబ్జెక్ట్ వుంటుంది, కాకపోతే గత 14ఏళ్ల నాన్నగారి పాలనలో వీడియో కాన్ఫరెన్స్‌ల పేర్లతో నాన్నగారు వారి బుర్రలను తినేశారు... ఐఏఎస్ చదివిన వాళ్ల చేత రోడ్లు వూడ్పించడం, కాలువల్లో పూడిక తీయించడం, మొక్కలకు నీళ్లు పోయడం వంటివి మాత్రమే చేయించారు. కాబట్టి వాళ్ల దగ్గర అసలు సబ్జెక్ట్ అంతా దొబ్బేసింది అనేది నాన్నగారి మాటల పరమార్ధం అని అసలు విషయం చల్లగా చెప్పాడు.

# బెల్టుషాపులను పట్టించుకోని చంద్రబాబు

- సిఎంగా జగన్ వచ్చాకనే వాటి నిర్మూలన
- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న



చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపులుండేవి. వాటిని తొలగిస్తామని చెప్పుండేవారే తప్ప తొలగించింది లేదు. అయితే జగన్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వచ్చాకనే బెల్టుషాపుల నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 10న ఆయన ఇందుకూరుపేట మండలంలోని దేవిస్‌పేట గిరిజన కాలనీలో వైయస్సార్సీపి నాయకుడు నెల్లూరు వెంకటరమణయ్య ఆధ్వర్యంలో పేదలకు కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్సీపి అధికారంలోకి వచ్చిన తర్వాతనే మద్యం దుకాణాలు, బార్లు తగ్గించారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పల్లెల్లో బెల్టుషాపులు ఎక్కువగా ఉండేవని, జగన్ అధికారంలోకి రాగానే వాటిని పూర్తిస్థాయిలో నిర్మూలించడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో దశల వారీగా మద్యపాన నిషేధానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ పద్మజ, ఎంపిడిఓ రఫీఖాన్, వైయస్సార్సీపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలను టీటీడీ ఆదుకోవాలి

కరోనా మహమ్మారి వల్ల దేశంలో లాక్‌డౌన్ విధించడంతో ఎంతోమంది పేద, మధ్య తరగతి ప్రజలు ఆకలితో అలమటిస్తూ, ఆర్థికంగా దెబ్బతిని నానా అవస్థలు పడుతున్నారని, వారందరిని మానవతా దృక్పథంతో తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యం ఆదుకోవాలని నెల్లూరుకు చెందిన ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి బొగ్గవరపు శ్రీమన్నారాయణ అభ్యర్థించారు. రాష్ట్రంలో ప్రతి నగరంలో టీటీడీ కల్యాణ మండపాలు ఉన్నాయని, సదరు కల్యాణ మండపాల్లో టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయంతో పేద ప్రజలందరికి భోజన వసతి ఏర్పాటు చేయాలన్నారు. కరోనా వైరస్ సోకకుండా ప్రతినిత్యం శ్రమిస్తున్న డాక్టర్లు, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులకు భోజనాలు, మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేయాలని కోరారు. ఇలాంటి విపత్కర సమయంలో టీటీడీ బోర్డు వారు స్పందించి సహాయం చేయాలని ఆయన వారిని కోరారు.

# ఎస్పీకి మాస్కులు



10 ఆంధ్రా నావల్ యూనిట్ కమాండింగ్ అధికారి కెప్టెన్ జీయస్ యుగంధర్‌రెడ్డి ఈనెల 13న జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ భాస్కర్ భూషణ్‌కు ఎన్‌సీసీ నావల్ క్యాడెట్లు తయారుచేసిన 3వేల మాస్కులను అందజేశారు. ఈ సందర్భంగా యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ మొదటి విడతగా 3వేల మాస్కులను నెల్లూరు మునిసిపల్ కమిషనర్‌కు అందజేయడం జరిగిందన్నారు. త్వరలో హెల్త్ వర్కర్లకు, వాలంటీర్లకు మాస్కులను అందజేస్తామని తెలిపారు.

# జడ్పీ మహిళా వాకర్స్ చేయూత



జడ్పీ వాకర్స్ మహిళా సంఘ సభ్యులు ఈనెల 13న నెల్లూరు వేదాయపాళెం ఉడ్ కాంప్లెక్స్ ప్రాంతంలో నివసిస్తున్న 40 నిరుపేద కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, బిస్కెట్లు, మాస్కులు అందజేశారు. మహిళా సంఘ సభ్యులు రాణి ఎబినైజర్, మేరీ, లక్ష్మీ, బ్లిస్సింగ్ టన్, నీరజమ్మ, విద్యావతి, ప్రవీణ, అరుణ, హరిసుధ, రీడ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్‌రసూల్, జడ్పీ వాకర్స్ అసోసియేషన్ ప్రచార కార్యదర్శి మండవ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఆత్మీయులకు ఆసరాగా ఆర్‌ఎస్‌ఆర్



నెల్లూరు వనంతోపుకు చెందిన వైసిపి నాయకుడు రాయపు శ్రీనివాసరావు (ఆర్‌ఎస్‌ఆర్) ఈ కరోనాకాలంలో గత 15ఏళ్ళుగా తనతో కలిసిమెలిసి ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్న ఆత్మీయులకు అండగా నిలిచాడు. తన రాజకీయ ప్రయాణంలో కలిసి నడుస్తున్న వ్యక్తిగత అనుచరులకు, అభిమానులకు, కార్యకర్తలకు బియ్యం, ఇతర నిత్యావసరాలు పంపిణీ చేసి తన ఆత్మీయతను చాటుకున్నాడు. ఈ కార్యక్రమంలో చేజర్ల మహేష్‌బాబు, పెనుబాక దిలీప్ రెడ్డి, గౌడుసు కిశోర్, ఒంగోలు సురేష్, పోతురాజు రవి, సి.ఎచ్.శ్రీను, ఆనంగి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# ప్రొ. కొత్రా శ్రీనివాసులు



నెల్లూరు వాస్తవ్యుడు, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో ఉన్న విక్రమ్ యూనివర్శిటీ విశ్రాంత రసాయనిక శాస్త్ర ప్రొఫెసర్ కొత్రా శ్రీనివాసులు ఈనెల 9న ఉజ్జయినిలో కన్నుమూశారు. ఆయన వయసు 88 సంవత్సరాలు. ప్రొఫెసర్ శ్రీనివాసులుకు భార్య ప్రొఫెసర్ ప్రభావతి, కుమార్తె శ్రీలక్ష్మి, కుమారుడు శ్రీధర్ ఉన్నారు.

ఇనార్గానిక్ కెమిస్ట్రీ(నిరింద్రయ రసాయన శాస్త్రం)లో నిష్ణాతుడైన ప్రొఫెసర్ శ్రీనివాసులు పలు దేశాల్లో కూడా పర్యటించి సోలార్ బ్యాటరీలు, జియోలైట్స్ మొదలైన రంగాలలో తన ప్రతిభను కనపరిచి అందరి ప్రశంసలు పొందారు. ఎందరో పరిశోధక విద్యార్థులకు ఆయన గురువు. ఆయన నేతృత్వంలో పిహెచ్‌డి పట్టాలు పొందిన విద్యార్థులు ఎందరో ఉన్నారు. గతంలో ఆంధ్ర పత్రికలో పనిచేస్తూ సీనియర్ జర్నలిస్టుగా అందరికీ సుపరిచితులైన దివంగత కొత్రా ఆదిశేషయ్య తమ్ముని కుమారుడే ప్రొ.శ్రీనివాసులు. నెల్లూరులోని విఆర్ కళాశాల విశ్రాంత లెక్చరర్, అమెరికాలో స్థిరపడి గొప్ప శాస్త్రవేత్తగా రాణించిన కొత్రా వి.కృష్ణమూర్తి సోదరుడు శ్రీనివాసులు. ఉజ్జయినిలో పనిచేస్తున్నా నెల్లూరుతో ఉన్న అనుబంధాన్ని ఆయన ఎప్పుడూ విస్మరించేవారు కాదు. 2002 అక్టోబర్ 7న విఆర్ కాలేజీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన మూడు వారాల యుజిసి రిఫ్రెషర్స్ కోర్సు ప్రారంభోత్సవ సభకు ఆయన్ను ఆహ్వానించగా, ఎంతో సంతోషంతో ఇక్కడికి వచ్చి అత్యద్భుతంగా ఉపన్యసించారు. ఆరోజు అప్పటి ఎమ్మెల్యే, విఆర్‌సి కరెస్పాండెంట్‌గా ఉన్న ఆనం వివేకానందరెడ్డి తదితరులు ఆయనను సత్కరించి జ్ఞాపికను కూడా అందజేయడం విఆర్‌సి అధ్యాపకులకు నేటికీ తీపిగురుతుగానే ఉంది. నెల్లూరులో ఏటా జరిగే భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ సంస్మరణోత్సవాల్లో వేదికపై జరిగే స్వామివార్ల అలంకార సేవలకు ఆయన ఒకరోజు ఉభయకర్తగా సేవలందించేవారు. ప్రొ. శ్రీనివాసులు మృతిచెందారన్న సమాచారంతో విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డా.ఎం.సుబ్రహ్మణ్యం, విశ్రాంత అధ్యాపకులు డా.పి. మల్లికార్జునరెడ్డి, డా.ఏ. సుందర్‌జాకబ్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. రసాయనశాస్త్రం ఆచార్యునిగా దేశవిదేశాల్లోనూ మంచి ఖ్యాతిని తెచ్చుకున్న నెల్లూరుబిడ్డ ప్రొఫెసర్ శ్రీనివాసులు మృతికి విచారం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది..'లాయర్'!...

# నెల్లూరు ఝాన్సీలక్ష్మి



నెల్లూరురూరల్, నరసింహకొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలక కమిటీకి రెండుసార్లు సభ్యురాలిగా పనిచేసిన నెల్లూరు ఝాన్సీలక్ష్మి గురువారం చెన్నైలో కన్నుమూశారు. ఆమె గతంలో కాంగ్రెస్ పార్టీలోను, ఆ తర్వాత టిడిపి లోనూ పనిచేశారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డితో పాటు వైసిపిలో చేరారు. రాజకీయాల్లో మహిళల తరపున చురుగ్గా వ్యవహరించేవారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి ఆమె మృతి పట్ల సంతాపం తెలిపారు.





స్మృత్యంజలి



మీ జ్ఞాపకాలు అజరామరం..
మీ ఆశయాలు అమరం!
మీ స్మృతులతో...

కీ॥శే॥ శ్రీ కె.వి.రమణయ్య - శ్రీమతి రమాదేవి

కుమారులు - కోడళ్ళు
కనుపర్తి రామకృష్ణప్రసాద్ - మీన
కనుపర్తి దయాశంకర్ - రేణుక

కుమార్తెలు - అల్లుళ్ళు
సీతాలక్ష్మి - దంటు విశ్వనాథ సూరి
జ్యోతిలక్ష్మి - చుండి వెంకటనరసింహశర్మ

మనవళ్ళు, మనవరాళ్ళు మరియు మునిమనుమరాలు

# జల జగడం

(మొదటి పేజీ తరువాయి)

కావేరి జలాల విషయంలోనే ఆ రెండు రాష్ట్రాలలో ఎన్నోసార్లు బంద్‌లు, ఆందోళనలు కూడా జరిగాయి. నదీ జలాలను వాడుకునే విషయంలో కేంద్ర జలమండలి మార్గదర్శకాలను ఎగువ రాష్ట్రాలు ఉల్లంఘించడం, అనుమతులు లేకుండా డ్యాంలు కట్టడం, క్రిందకు నీళ్లు వదలకపోవడం వంటి చర్యలతోనే జల వివాదాలు తలెత్తుతుంటాయి.

2014లో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగేటప్పుడు భవిష్యత్‌లో ఆంధ్రా, తెలంగాణల మధ్య కృష్ణా నది జలాల పంపకంలోనే గొడవలు వస్తాయని ఊహించారు. అప్పుడే నిపుణులు కూడా హెచ్చరించారు. ఇవేమీ పట్టించుకోని యూపిఏ ప్రభుత్వం ఆనాడు ఆంధ్రప్రదేశ్‌ను అడ్డంగా విభజించడం జరిగింది. 2014లో ఏపిలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తెలంగాణలో టీఆర్ఎస్ వచ్చింది. రెండేళ్ల తిరక్కుముందే ఏపి సీఎం చంద్రబాబు 'ఓటు-నోటు' కేసులో కేసీఆర్ చేతికి అడ్డంగా దొరికిపోయాడు. దీంతో చంద్రబాబు తన వ్యక్తిగత స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను బలిపెట్టాడు. హైదరాబాద్‌పై పదేళ్ల ఉమ్మడి రాజధాని హక్కును వదులుకుని కృష్ణానది కరకట్ట మీద పడ్డాడు. హైదరాబాద్‌లో ఏపి ఆస్తులను వదిలేశాడు. చివరకు కేసీఆర్‌కు భయపడి తన ఐదేళ్ల పాలనా కాలంలో కృష్ణా నది మిగులు జలాలను రాయలసీమ, ప్రకాశం, నెల్లూరుజిల్లాలకు తరలించే విధంగా ఒక కొత్త ప్రాజెక్ట్‌ను కూడా చేపట్టలేకపోయాడు. చంద్రబాబు తన భద్రత కోసం ఏ.పి ప్రజల ప్రయోజనాలను తెలంగాణకు తాకట్టుపెట్టేశాడు.

కాని, ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చంద్రబాబులా కేసీఆర్‌కు బెదిరిపోయే రకం కాదు, భయపెట్టే రకం. తన తండ్రిలానే ఎదిరించే రకం. దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే శ్రీశైలం నుండి రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు నీటిని తరలించే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచడం జరిగింది. ఆరోజు వైయస్ ఆ పని చేయబట్టే ఎంత కరువులోనూ రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల దాహం తీరుతోంది. చెన్నైకీ తాగునీళ్ళు అందించగలుగుతున్నాము. అప్పట్లో పోతిరెడ్డి పాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యం పెంచుతుంటే ఇదే కేసీఆర్ నానా యాగీ చేశాడు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడంతోటే తెలంగాణ సీఎం కేసీఆర్‌తో స్నేహసంబంధాలకు పెద్దపీట వేశాడు. అయితే ఆయన రాష్ట్ర ప్రయోజనాల విషయంలో మాత్రం చంద్రబాబులాగా రాజీపడే ధోరణిలో లేడు. కృష్ణానది మిగులు జలాలను కరువు ప్రాంతాలకు అందించే ఆలోచనతో జగన్మోహన్‌రెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 80 క్యూసెక్కులకు పెంచడంతో పాటు, రాయలసీమ కరువు నివారణ ఎత్తిపోతల పథకం చేపట్టాడు. దీనిద్వారా వరదల సమయంలో సముద్రానికి వృధాగా పోతున్న మిగులు జలాలను రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు ఇవ్వాలనుకున్నాడు.

గత ఏడాది కృష్ణానదికి పెద్ద ఎత్తున వరదలు రావడం తెలిసిందే! అప్పట్లో శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీ నిండిపోయి వందలాది టిఎంసీల నీటిని సముద్రం పాల్జేశారు. అదేగనుక కృష్ణ నీటిని ఇతర ప్రాంతాలకు మళ్లించడానికి అవకాశాలు వుండుంటే, ఇన్ని టీఎంసీలను సముద్రునికి పంపాల్సిన అవసరముండేది కాదు. భవిష్యత్‌లో ఇలాంటి వరదలు వస్తే ఆ వరద జలాలను సద్వినియోగం చేసుకోవాలనే సంకల్పంతోనే జగన్ ఈ కొత్త ప్రాజెక్టులు పెట్టుకున్నాడు.

దీనిపై కేసీఆర్ నానా రాద్ధాంతం మొదలుపెట్టాడు. తెలంగాణలో ఆయన ఇప్పటికే ఎన్నో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేశాడు. ఏ ఒక్కదానికి కూడా ఆంధ్రా అభ్యంతరం వ్యక్తం చేయలేదు. కేంద్ర జలవనరుల సంఘం నిర్దేశించిన విధంగా జల వాటాకు ఏపి సిద్ధంగానే వుంది. మిగులు జలాల వాడకం కోసమే జగన్ ప్రయత్నం. మొన్నటి వరదల సమయంలో కేసీఆర్ కూడా... సముద్రానికి నీళ్లు పోకుండా ఏ రాష్ట్రం వాళ్ళు వాడుకున్నా మంచిదేనన్నాడు. ఆయన అదే స్ఫూర్తితో వ్యవహరిస్తే ఇరు రాష్ట్రాల మధ్య జలజగడానికి తావే లేదు.

# కరోనా వాతకు.. ప్యాకేజీ పూత

(మొదటి పేజీ తరువాయి)

భారత్‌లోనూ రెండున్నర వేలమంది దాకా ఈ వ్యాధికి బలైపోయారు. మరో 70వేల మందికిపైగా ప్రజలు ఈ వ్యాధి బాధతో అల్లాడుతున్నారు. అయితే కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు, వైద్యసిబ్బంది నిర్విరామ సేవలతో సుమారు పాతికవేల మందిదాకా ఈ వ్యాధి నుంచి కోలుకోవడం శుభపరిణామం. రోజురోజుకీ కరోనా విజృంభిస్తున్న పరిస్థితుల్లో ఒక వైపు ప్రజల ప్రాణాలు కాపాడుకుంటూనే మరోవైపు ప్రజల జీవనోపాధికి కూడా ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం అత్యంత అసాధారణమైన నిర్ణయాలతో, సాహసోపేతమైన విధానాలతో ప్రజలను ఆదుకునేందుకు సహాయ కార్యక్రమాలను చేపడుతుండడం భారతీయుల అదృష్టమే!

## స్వావలంబన సాధించాలి

ప్రధాని మోడీ జాతినుద్దేశించి ప్రసంగిస్తూ కరోనాను జయించడంతో పాటు దేశంలోని అన్నిరంగాల్లో స్వావలంబన సాధించడమే తక్షణ కర్తవ్యమని స్పష్టం చేశారు. ఆత్మవిశ్వాసంతోనే మనందరం ముందుకు సాగాలని, సంక్షోభాలను అధిగమించి అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. సంక్షోభ సమయంలో ప్రజల అవసరాలన్నిటినీ స్థానిక వ్యవస్థలే తీరుస్తున్నాయని, అందువల్ల ఆ వ్యవస్థలను కాపాడుకోవడమే కాక మరింత బలోపేతం చేసుకోవాలన్నారు. స్థానికతే మన జీవనమంత్రం కావాలన్నారు. ప్రపంచస్థాయి ఉత్పత్తుల బ్రాండ్లన్నీ ఒకప్పుడు స్థానికమైన వేనని గుర్తుచేశారు. ఇకపై ప్రతి భారతీయుడు స్థానిక ఉత్పత్తులను ఉపయోగించాలని, వాటికి ప్రచారం కల్పించాలని ప్రధాని మోడీ పిలుపునివ్వడంతో దేశవ్యాప్తంగా స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించినట్లయింది. అంతేకాదు, కరోనా మనతో పాటు సుదీర్ఘకాలం ఉంటుందని నిపుణులు చెప్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మాస్కు పెట్టుకుని, భౌతిక దూరం పాటిస్తూ ముందుకు సాగాలని, స్వీయ నియంత్రణే కరోనా కట్టడికి ప్రధాన మార్గమని ప్రధాని స్పష్టం చేశారు. కరోనా మహమ్మారి దెబ్బకు కుదేలైన దేశ ఆర్థిక వ్యవస్థ పునర్జీవించేలా కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిభావంతంగా పథకాల కల్పనకు కృషి చేస్తోండడం పట్ల దేశప్రజల్లో ఎంతో ఊరట కలుగుతోంది.

## అన్ని వర్గాల ప్రజలకు చేయూతగా భారీ ప్యాకేజీ

దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ఈ సంక్షోభం నుంచి దేశాన్ని కాపాడేందుకు ప్రధాని మోడీ ఈనెల మే 12వ తేదీన 'ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్' పేరుతో ప్రకటించిన ఇరవై లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ అన్ని వర్గాల ప్రజలకు సంతృప్తిని కలిగిస్తోంది. ఇంతపెద్ద మొత్తం మన జిడిపిలో 10శాతం కావడం, గత ఏడాది వార్షిక బడ్జెట్ 30,42,230 కోట్ల రూపాయలు కాగా, ఇప్పుడు ప్రకటించిన ప్యాకేజీ అందులో దాదాపు రెండువంతులు మొత్తం కావడం విశేషం. ఏవిధంగా చూసినా ఇంత భారీ నిధిని కేటాయించడం అత్యంత సాహసోపేతమైన చర్యేనని చెప్పక తప్పదు. ఈ భారీ నిధిలో ఏ రంగానికి ఎంతెంత కేటాయిస్తున్నారో పూర్తి వివరాలు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఒకటొక్కటిగా చెప్తున్నారు. తొలిదశ లాక్‌డౌన్ ప్రారంభమయ్యాక 1.7 లక్షల కోట్ల ప్యాకేజీని కేంద్రం ప్రకటించింది. ఇందులో రైతులు, సీనియర్ సిటిజన్లు, వితంతువులు, దివ్యాంగులు, మహిళలకు స్వయం ఉపాధి పథకాలు, కూలీలకు, కార్మికులకు, వైద్యసిబ్బంది తదితరులందరికీ లబ్ది చేకూరేలా ఆ ప్యాకేజీని రూపొందించారు. ఆ తర్వాత రిజర్వ్‌బ్యాంక్ ప్రకటించిన 7 లక్షల కోట్ల ప్యాకేజీలు కూడా వెచ్చించారు. అయితే ఇన్ని పథకాలు వచ్చినా అనేకవర్గాల్లో సంతృప్తి కనిపించకపోవడంతో కేంద్రం మరింతగా దృష్టి సారించి, రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశమై పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఈ కష్టకాలంలో ప్రజలందరికీ చేయూతనిచ్చేందుకు తనవంతుగా చేయాల్సినదంతా చేయాలని సంకల్పించింది. ముఖ్యంగా చిన్న పరిశ్రమలకు, పెద్దసంఖ్యలో దేశవ్యాప్తంగా ఉన్న వలస కూలీలకు జీవనోపాధి కలిగించేందుకు తగు కార్యాచరణ చేపట్టింది.

## చిన్న పరిశ్రమలకు పెద్దఎత్తున సాయం

దేశవ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇలు)తో సహా వ్యాపార వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేందుకు ప్రధాని మోడీ ప్రకటించిన 20లక్షల కోట్ల ప్యాకేజీలో 5,94,250 కోట్ల రూపాయలు కేటాయించారు. దీంతో పాటు పరిశ్రమల వారికి అనేక రకాల రాయితీలు, ఇతరత్రా సదుపాయాలు కలిగించేందుకు కూడా ఈ ప్యాకేజీ దోహదం చేస్తుంది. లాక్‌డౌన్ కారణంగా పారిశ్రామిక రంగం స్తంభించిపోయింది. క్రమేణా గ్రీన్‌జోన్‌లలో పరిశ్రమలు ప్రారంభించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఈ సంక్షోభసమయంలో ఏ రంగంలో వారికి కూడా ఎలాంటి అసంతృప్తి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సాయం అందని వర్గాలవారు ఆశిస్తున్నారు. ఏదేమైనా మరింత కష్టాల్లో ఉన్న నిరుపేదలు, శ్రామికులు, వలస కార్మికులు, మత్స్యకారులు, పశుపోషకులు, ఉద్యోగులు, సంఘటిత అసంఘటిత రంగాల వారు.. ఇలా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుండడంతో దేశప్రజలకు ఎంతో ఊరట కలుగుతోంది.

# నెల్లూరుకు మోక్షమెప్పుడో?

(మొదటి పేజీ తరువాయి)

రెడ్‌జోన్‌లు, కంటోన్మెంట్ జోన్‌లలో తప్ప మిగతా చోట్ల అన్ని దుకాణాలు తెరుచుకోవచ్చని జిల్లా కలెక్టర్ సెలవిచ్చారు. తాము ఏ జోన్‌లో ఉన్నామన్నది దుకాణాల యజమానులకే అర్థం కావడం లేదు. అధికారుల మాటలు నమ్మి షాపులు తెరిస్తే ఎక్కడ కేసులు పెడతారోనని వారు భయపడుతున్నారు. దీనిబదులు ఏపీ ప్రాంతాలలో షాపులు సాయంత్రం 7 గంటల దాకా తెరచుకోవచ్చే అధికారులే ప్రకటిస్తే కొంత సులభంగా ఉంటుంది.

## పేరుకే జోన్‌లు... లాభమేంటి?

రెడ్‌జోన్, కంటోన్మెంట్‌లలో కార్యకలాపాలు పూర్తిగా స్థంభించిపోవాలి. ఆ ప్రాంతాల ప్రజలు బయటకు రాకుండా, వారి ఇళ్లకే నిత్యావసర సరుకులు, కూరగాయలు వంటివి అందించాలి. కాని నెల్లూరులో అలాంటి లాక్‌డౌన్ నిబంధనలు అమలైన దాఖలాలు లేవు. ఉదాహరణకు గత నెల 5వ తేదీ నుండి మాగుంట లే అవుట్ రెడ్‌జోన్‌లో వుంది. కాని ఆరోజు నుండి కూడా మాగుంట లే అవుట్‌లోని 'డి-మార్ట్' మాల్‌ను తీస్తూనే వున్నారు. కొన్ని వేలమంది వినియోగదారులు మాగుంట లేఅవుట్ రోడ్లలోనే డి-మార్ట్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. దీనివల్ల రెడ్‌జోన్ పెట్టి కూడా ఏం లాభం?

కరోనా పాజిటివ్ కేసులు తగ్గుముఖం పట్టాయి... కొత్త కేసులకంటే డిశ్చార్జ్ అవుతున్నవాళ్ళే ఎక్కువుగా వున్నారు. ఇంకో వారంరోజులకు కేసులు పూర్తిగా తగ్గుతాయనుకున్న తరుణంలో చెన్నైలోని కోయంబేడు మార్కెట్ లింకు కొంపముంచింది. కోయంబేడు ఇప్పుడు కరోనా హాట్ స్పాట్‌గా మారింది. వందలాది కేసులు బయటపడుతున్నాయి. అవి వేలల్లోకి చేరినా ఆశ్చర్యపోనక్కరలేదు.

దేశంలోనే అతిపెద్ద మార్కెట్ కోయంబేడు. రోజుకు కొన్ని లక్షల మంది ఇక్కడకు రాకపోకలు సాగిస్తుంటారు. లావాదేవీలు కొనసాగిస్తుంటారు. లాక్‌డౌన్‌లో సరైన నిబంధనలు పాటించని కారణంగా ఇది కరోనా వైరస్ ఉత్పత్తి కేంద్రమైంది.

కోయంబేడు ప్రభావం జిల్లాలో మొదట సూళ్లూరుపేటపై పడింది. చెన్నైకి దగ్గర కావడంతో ఇక్కడి వ్యాపారులు కోయంబేడు మార్కెట్‌కు వెళ్లి వస్తూ కరోనాను కూడా వెంటబెట్టుకుని వచ్చారు. ఇప్పటికే ఇక్కడ 20 కేసులు బయటపడ్డాయి. ఇక్కడ కేసుల సంఖ్య 50 దాటొచ్చని అంచనా!

కోయంబేడు మూలాలు జిల్లాలో అన్ని మూలల్లో వున్నాయి. లాక్‌డౌన్ మూలంగా ఉదయగిరి ప్రాంతవాసులు కూడా తాము పండించిన కూరగాయలు కోయంబేడుకు తీసుకెళ్లి అమ్మారు. ఇలా చాలా మండలాల రైతులు కోయంబేడుకు వెళ్ళివచ్చినట్లు తెలుస్తోంది. అధికారులు కోయంబేడు కాంటాక్ట్ లిస్ట్‌నంతా బయటకు తీసి, వారి ఫోన్ నెంబర్ల ఆధారంగా ప్రతి ఒక్కరినీ క్వారంటైన్‌కు తరలించారు. జిల్లాలో వైరస్ సద్దుమణిగిందనుకున్న తరుణంలో కోయంబేడు దెబ్బతో కేసుల సంఖ్య సెంచరీ దాటింది.

### కరోనాపై యుద్ధానికి...

# ఇంజనీరింగ్ కాలేజీల భారీ సాయం



కరోనా వైరస్‌పై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న యుద్ధానికి రాష్ట్ర ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్య సంఘం మద్దతుగా నిలిచింది. ఆ సంఘం అధ్యక్షుడు, వైసిపి నాయకుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఇటీవల తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి తమ సంఘం తరపున 2కోట్ల 56 లక్షల రూపాయల విరాళం చెక్కును అందజేశారు. కరోనా నివారణకు భారీ విరాళంతో ముందుకొచ్చిన ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలను సీఎం జగన్ అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలం సురేష్, సంఘం ప్రతినిధులు ఆలూరు సాంబశివారెడ్డి, ఆదిమండ వరప్రసాద్‌రెడ్డి, మిట్టపల్లి కోటేశ్వరరావు, దాడి రత్నాకర్ పాల్గొన్నారు.

### శ్రీసిటీలో

# కరోనా అవగాహన పోస్టర్ల విడుదల



పరిశ్రమల ఉత్పత్తుల పునః ప్రారంభాన్ని పురస్కరించుకుని, కరోనావైరస్ వ్యాప్తి నివారణపై పరిశ్రమల ఎగ్జిక్యూటివ్‌లు, కార్మికుల మధ్య అవగాహన కల్పించేందుకు, స్థానిక వైటల్ పేపర్స్ పరిశ్రమ యాజమాన్యం సహకారంతో శ్రీసిటీ కరోనా వ్యాప్తిని నిరోధించేందుకు అవసరమైన సమాచార పోస్టర్లను విడుదల చేసింది. సోమవారం ఉదయం స్థానిక బిజినెస్ సెంటర్లో శ్రీసిటీ డెవలప్మెంట్ కమిషనర్ ఆర్.ముత్తురాజ్, డీఎస్పీ విమలకుమారి లాంఛనంగా పోస్టర్లను విడుదల చేశారు. పరిశ్రమ వర్గాలకు సరైన సమాచారంతో అవగాహన కల్పించడం, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ జారీ చేస్తున్న సలహాల ప్రకారం జాగ్రత్తలు తీసుకోవడం ఈ వైరస్ వ్యాప్తిని నివారించడంలో ఇందులో ముఖ్యమైన అంశాలుగా పేర్కొన్నారు. కోవిడ్ లక్షణాలు, దాని వ్యాప్తిని నివారించే పద్ధతులు, సామాజిక దూరం ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రతను కాపాడటం వంటి సమాచారాన్ని పోస్టర్లలో వివరించారు. శ్రీసిటీలోని అన్ని యూనిట్లకు దీనిని పంపిణీ చేయడంతో పాటు ముఖ్యమైన ప్రదేశాలలో దీనిని ప్రదర్శించనున్నట్లు శ్రీసిటీ ప్రతినిధులు తెలిపారు.


# స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీగా శ్రీధర్‌రావు



జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీగా ఎస్.వెంకటశ్రీధర్‌రావు నియమితులయ్యారు. ఈనెల 13న ప్రభుత్వం ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మద్యం అక్రమ రవాణా, తయారీ, ఇసుక అక్రమాలను నిరోధించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ఏర్పాటుచేసింది. ఈ విభాగానికి డిజిపి అధిపతి కాగా, కమిషనర్‌గా ఐపిఎస్ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్‌ను నియమించారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు ఐపిఎస్‌లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో 11 మంది ఏఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. నెల్లూరు రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటశ్రీధర్ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీగా నియమితులయ్యారు. తిరుపతికి చెందిన శ్రీధర్‌రావు 2010 గ్రూప్-1 అధికారి. మైదుకూరు, తిరుపతి, ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ అధికారిగా, గుంతకల్ సిఐడి డిఎస్పీగా పనిచేశారు. 2018లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది తూర్పు గోదావరి జిల్లా ఏఎస్పీగా పనిచేశారు. అనంతరం నెల్లూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా ఆయన బదిలీ అయ్యారు.

# చంద్రబాబు క్షుద్ర రాజకీయం

## ప్రతి అంశాన్నీ రాజకీయ కోణంలోనే ఆలోచించే ఏకైక నాయకుడు



రాజకీయ నాయకుడికైనా, సాధారణ పౌరుడికైనా, కోటీశ్వరుడికైనా, పేదోడికైనా, పారిశ్రామికవేత్తకైనా, అతని వద్ద పనిచేసే కార్మికుడికైనా వారి వృత్తి వ్యవహార శైలిని పక్కనపెడితే మానవతా కోణం ఒకటి వుంటుంది. వాళ్లు చేసే వృత్తులకు అది భిన్నంగా వుంటుంది.

రాజకీయాలలో ఎంతోమంది కరుడుగట్టిన నాయకులుంటారు. సిద్ధాంత పరంగా విభేదించే వాళ్లుంటారు. అలాంటివాళ్ళు సైతం కొన్ని కొన్ని సందర్భాలలో ఏకమవుతుంటారు. కొన్ని విషయాలలో సంఘటితమవుతుంటారు.

కాని భారతదేశంలో ప్రతి క్షణం, ప్రతి అంశాన్నీ రాజకీయ కోణంలోనే ఆలోచించే ఏకైక నాయకుడు తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు. కరోనా దెబ్బకు హైదరాబాద్‌లో కూర్చున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తే ఏపిలో అడుగుపెడతానని డాంబికాలు పలుకుతాడేగాని ఆ ధైర్యం చేయడు. నేనే సీఎంగా వుంటే కరోనా వైరస్‌ను కాలితో తన్నేవాణ్ణి, ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీలు చేసి డాక్టర్లను హడలెత్తించే వాడినంటూ బీరాలు పలుకుతున్నాడు. సరే ఈ సొల్లు మాటలకేమిలే అనుకుంటే...

విశాఖపట్నం ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్ లీకేజీ దుర్ఘటనపై కూడా ఆయన క్షుద్రరాజకీయాలు చేయడం విస్మయం కలిగిస్తోంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ద్వారా బాధితులకు మరింత సాయం అందేలా డిమాండ్ చేయాలి. ప్రభుత్వ చర్యలను ప్రోత్సహించాలి. బాధితులకు ధైర్యం చెప్పేలా మాట్లాడాలి. కాని చంద్రబాబు ఇక్కడ తన వక్రబుద్ధిని మానుకోలేదు. దేశ చరిత్రలోనే ఏ ప్రమాదంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ కూడా ఇవ్వనంత భారీ నష్టపరిహారాన్ని బాధితులకు జగన్మోహన్‌రెడ్డి అందజేశాడు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటిరూపాయలు అంటే దేశ చరిత్రలో ఇదే ప్రథమం.

చంద్రబాబు దీనిని వంకరగానే మాట్లాడాడు. కోటి రూపాయలు ఏం సరిపోతాయంటూ హేళన చేశాడు. ఈయన సీఎంగా వున్నప్పుడు గోదావరి పుష్కరాల మృతులకు ఎంతిచ్చాడో... ఒక్కసారి వెనక్కు చూస్తే ఆయన బండారమంతా బయటపడుతుంది. నేనైతే నేరుగా ఎల్‌జీ ఫ్యాక్టరీలోకే పోయే వాడినంటూ బిల్డప్ ఒకటి... కరోనా దెబ్బకు భయపడి ఇల్లు దాటి బయటకు రానోడు... విశాఖకు వచ్చి విషవాయువును పీలుస్తానంటే జనం నమ్ముతారా?

చంద్రబాబు కుటిల రాజకీయాలను జనం నమ్మే పరిస్థితి పోయింది. అలా నమ్ముంటే మొన్న ఎన్నికల్లో కూడా ఆయన గెలుచుండాలి. జనాలు నమ్మకనే ఇంటికి పంపారు. ఇప్పటికైనా ఆ వంకర రాజకీయాలు మానుకుంటే ఎంతో మంచిది.

# నీళ్ళతో.. నిప్పులు

**కృష్ణానది జలాల పంపకం రెండు రాష్ట్రాల మధ్య వివాదం రేపుతుంటే, నెల్లూరుజిల్లాలో సోమశిల జలాల పంపకం రెండు ప్రాంతాల మధ్య, ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య చిచ్చురేపుతోంది. అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఒకరిపై ఒకరు కత్తులు నూరుకునే పరిస్థితి వస్తోంది.**



జిల్లాలో రెండోకారు పంటకు నీళ్లివ్వాలని నిర్ణయించడం తెలిసిందే! రెండోకారులో డెల్టాలోనే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. సోమశిల రిజర్వాయర్ క్రింద కోవూరు నియోజకవర్గ పరిధిలోనే ఆయకట్టు ఎక్కువుగా వుంది. సోమశిల నుండి డెల్టాకు నీళ్లొదిలి, తర్వాత మిగతా కాలువలకు వదులుతుంటారు. గత కొంతకాలంగా కావలి కాలువ క్రింద రైతాంగం సోమశిల నీళ్ళ విషయంలో గట్టిగానే పోరాడుతోంది. నీళ్లను తీసుకుపోయే విషయంలో కావలి ఆయకట్టు రైతాంగం చాలా చురుగ్గా వుంటోంది.

రెండోకారుకు ఏ కాలువకు ఎన్ని నీళ్లు వదలాలో నిర్ణయించకుండానే మొన్న అధికారికంగా ఎవరికీ చెప్పాపెట్టకుండా ఇరిగేషన్ అధికారులు సోమశిల రిజర్వాయర్ నుండి 10వేల టీఎంసీల నీటిని వదలడం చిచ్చు రేపింది. సోమశిల నుండి చెప్పకుండా ఒక్కసారిగా నీళ్ల వదలడంతో కలువాయి మండలం వద్ద హైవే రోడ్డు దెబ్బతింది. సోమశిల నుండి వదిలిన నీళ్లు సంగం ఆనకట్ట వద్దకు చేరాయి.

కావలి ఎమ్మెల్యేనే కావలి ఆయకట్టు రైతాంగంతో కలిసి స్వయంగా సంగం ఆనకట్ట వద్దకు వచ్చి కలిగిరి కాలువను బిగించి కావలి కాలువకు నీళ్లు వదిలినట్లు సమాచారం. దీంతో కావలి కాలువకు నిండుగా నీళ్ళు వెళ్లాయి.

ఇది తెలిసి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఫైర్ అయ్యాడు. దొంగచాటుగా కావలి కాలువకు నీళ్లు వదిలిన ఇరిగేషన్ అధికారులపై ఆయన నిప్పులు కక్కుతున్నాడు. ఇరిగేషన్ మంత్రి జిల్లాలోనే ఇలా నీటి చౌర్యం జరిగింది. దీంతో మంత్రి అనిల్ కూడా షాక్‌కు గురై దీనిపై విచారణకు ఆదేశించాడు.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com